
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

7



విశాఖపట్నం

జిల్లా వార్తలు

మంగళవారం 30 ఏప్రిల్ 2024

ఇన్నోవేషన్ గ్లోబల్ హబ్‌గా ఇండియా

- వికసిత్ భారత్ కార్యక్రమంలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్
- ఏఐ స్టార్టప్‌ల కోసం రూ.10,300 కోట్లు కేటాయింపు
- విద్యార్థులు వికసిత్ భారత్ అంబాసిడర్లుగా పనిచేయాలని పిలుపు



- II పేజీలో

ముగిసిన నామినేషన్ల ఘట్టం

విశాఖ లోక్‌సభ నియోజకవర్గ బరిలో 33 మంది అభ్యర్థులు

- తెలుగుదేశం నుంచి ఎం.శ్రీభరత్
- వైసీపీ నుంచి బొత్స ఝాన్సీ లక్ష్మీ
- కాంగ్రెస్ నుంచి పి.సత్యనారాయణరెడ్డి

ఏడు అసెంబ్లీ స్థానాలకు బరిలో 101 మంది

- భీమిలి బరిలో 15 మంది
- 'తూర్పు'లో 14 మంది
- 'సౌత్'లో 16 మంది
- 'నార్త్'లో 15 మంది
- 'పశ్చిమ'లో 13 మంది,
- గాజువాకలో 15 మంది,
- పెందుర్తిలో 14 మంది పోటీ

విశాఖపట్నం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): **సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో ప్రధానమైన నామినేషన్ల ఘట్టం సోమవారం ముగిసింది. ఉపసంహరణకు తుదిగడువు అనంతరం విశాఖ లోక్‌సభ స్థానానికి 33 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నట్టు రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ప్రకటించారు. విశాఖ లోక్‌సభ స్థానం చరిత్రలో ఇంతమంది బరిలో ఉండడం ఇదే తొలిసారి. అలాగే జిల్లాలోని ఏడు అసెంబ్లీ స్థానాలకు చివరిరోజు 18 మంది నామినేషన్లు ఉపసంహరించుకోవడంతో 101 మంది పోటీలో మిగిలారు.**

విశాఖపట్నం పార్లమెంటు స్థానానికి 33 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. వీరిలో నలుగురు ప్రధాన పార్టీలకు చెందినవారు కాగా మరో 14 మంది రిజిస్టర్డ్ పార్టీల నుంచి నామినేషన్లు వేశారు. మిగిలిన 15 మంది స్వతంత్ర అభ్యర్థులు. తెలుగుదేశం పార్టీ తరపున మతుకుమల్లి శ్రీభరత్ (గీతం యూనివర్సిటీ అధ్యక్షులు), వైసీపీ నుంచి బొత్స ఝాన్సీలక్ష్మీ (మంత్రి బొత్స సత్యనారాయణ సతీమణి), కాంగ్రెస్ పార్టీ నుంచి పి.సత్యనారాయణరెడ్డి, బహుజన్ సమాజ్ పార్టీ తరపున పెదపెంకి శివప్రసాదరావు ఉన్నారు.

రిజిస్టర్డ్ పార్టీ అభ్యర్థులు

రిజిస్టర్డ్ పార్టీల నుంచి 14 మంది అభ్యర్థులు ఉన్నారు. అంధుకూరి విజయ భాస్కర్ (ఇండియా ప్రజా బంధు పార్టీ), మురపాల అచ్యుతకిరణ్ బాలాజీ (భారత చైతన్య యువజన పార్టీ), డాక్టర్ కొంగరపు గణపతి (రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా), కిలారి ఆనంద్ (ప్రజాశాంతి పార్టీ), గుంటు దుర్గాప్రసాద్ (భారతీయ రాష్ట్రీయ దళ్), గణపతి జగదీశ్వరరావు (జై మహా భారత్),గండికోట రాజేశ్ (నవతరం), ... మిగతా 8వ పేజీలో



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ మల్లికార్జున

భీమునిపట్నం



గంటా శ్రీనివాసరావు (టీడీపీ) | ముత్తంశెట్టి శ్రీనివాసరావు (వైసీపీ)

విశాఖ తూర్పు | **విశాఖ పశ్చిమం** | **విశాఖ దక్షిణం**



వెలగపూడి (టీడీపీ) | ఎంవీవీ (వైసీపీ) | గణబాబు (టీడీపీ) | ఆనందకుమార్ (వైసీపీ) | వంశీకృష్ణ శ్రీనివాస్ (జనసేన) | వాసుపల్లి (వైసీపీ)

విశాఖ ఉత్తరం | **గాజువాక** | **పెందుర్తి**



విష్ణుకుమార్‌రాజు (బీజేపీ) | కేకే రాజు (వైసీపీ) | లక్ష్మీ నారాయణ (జైభారత్ పార్టీ) | పల్లా శ్రీనివాసరావు (టీడీపీ) | గుడివాడ అమర్ (వైసీపీ) | పంచకర్ల రమేష్‌బాబు (జనసేన) | అదీప్‌రాజు (వైసీపీ)

శ్రీభరత్ x ఝాన్సీ

- లోక్‌సభ స్థానానికి ప్రధాన పోటీ టీడీపీ, వైసీపీ మధ్యే...
- అభ్యర్థులు ఇరవురూ రాజకీయ నేపథ్యం కలిగినవారే



ఎం.శ్రీభరత్ (టీడీపీ) | బొత్స ఝాన్సీ (వైసీపీ)

విశాఖ పార్లమెంటు స్థానానికి పోటీలో ఎంతమంది ఉన్నా ప్రధానంగా ఇద్దరి మధ్యే పోటీ జరగనుంది. వీరిలో ఒకరు కూటమి తరపున పోటీ చేస్తున్న మతుకుమిల్లి శ్రీభరత్ (టీడీపీ) కాగా మరొకరు వైసీపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ. వీరిద్దరికీ రాజకీయ నేపథ్యం ఉంది.

ఝాన్సీ లక్ష్మి ఒకసారి బొబ్బిలి నుంచి మరోసారి విజయనగరం నుంచి ఎంపీగా విజయం సాధించారు. ఆమె విద్యావంతురాలు. రెండు పీహెచ్‌డీలు చేశారు. ఆమె భర్త సీనియర్ మంత్రి బొత్స సత్యనారాయణ. మతుకుమల్లి శ్రీభరత్ అనూహ్యంగా రాజకీయాల్లోకి వచ్చారు. అయన తాత ఎంవీవీఎస్ మూర్తి గీతం యూనివర్సిటీ వ్యవస్థాపకులు. రెండుసార్లు విశాఖపట్నం నుంచి పార్లమెంటుకు ఎన్నికయ్యారు. మూర్తి 2108లో అమెరికాలో ఊహించని విధంగా జరిగిన కారు ప్రమాదంలో చనిపోయారు. దాంతో మనుమడైన శ్రీభరత్ వారసుడిగా తెరపైకి వచ్చారు. గీతం అధ్యక్షులుగా బాధ్యతలు తీసుకున్నారు. ఆయన యూఎస్‌లో పర్డ్యూ యూనివర్సిటీలో ఇండస్ట్రియల్ ఇంజనీ రింగ్, స్టాన్‌ఫర్డ్‌లో ఎంబీఏ చేశారు. ప్రపంచంలో విద్యా రంగంపై అమితమైన అవగాహన ఉంది. భారతీయ విద్యా వ్యవస్థలోను, ముఖ్యంగా ఏపీలో చాలా మార్పులు చేయాలనేది ఆయన ప్రగాఢ కోరిక. 2019 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ తరపున విశాఖ ఎంపీగా పోటీ చేశారు. మాజీ ఐపీఎస్ ఆఫీసర్ వీవీ లక్ష్మీనారాయణ జనసేన పార్టీ తరపున, బీజేపీ తరపున మాజీ ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి ఆ ఎన్నికల్లో నిలబడడంతో వైసీపీ, టీడీపీ, జనసేన, బీజేపీల మధ్య చతుర్ముఖ పోటీ జరిగింది. ఈ ఎన్నికల్లో ఓట్లు బాగా చీలడం వైసీపీకి లాభించింది. ఆ పార్టీ అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ 4,414 ఓట్ల స్వల్ప మెజారిటీతో శ్రీభరత్‌పై గెలుపొందారు. శ్రీభరత్ మరో తాత (తల్లి తండ్రి) కావూరి సాంబశివరావు. ఆయన సీనియర్ రాజకీయ నాయ కుడు. ఆయన కాంగ్రెస్ పార్టీ తరపున మచిలీపట్నం, ఏలూరు నియో జకవర్గాల నుంచి ఐదుసార్లు ఎంపీగా ఎన్నికయ్యారు. కేంద్ర మంత్రిగా కూడా పనిచేశారు. ఇక కాంగ్రెస్ పార్టీ తరపున సత్యనారాయణరెడ్డి, ప్రజాశాంతి పార్టీ తరపున కేఏ పాల్ పోటీ చేస్తున్నారు.

ఇండిపెండెంట్‌ను నిర్బంధించిన సీఐ

- నామినేషన్‌ను వెనక్కి తీసుకోవాల్సిందిగా ఒత్తిడి
- రిటర్నింగ్ అధికారికి బాధితుడి ఫిర్యాదు
- విచారణ అనంతరం సీఐపై సీపీ సస్పెన్షన్ వేటు



సీఐ సన్యాసినాయుడు

విశాఖపట్నం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): విశాఖ నగర పరిధిలోని మల్కాపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎన్.సన్యాసినాయుడును పోలీస్ కమిషనర్ రవిశంకర్ అయ్యన్నార్ సోమవారం సస్పెండ్ చేశారు. పశ్చిమ నియోజక వర్గానికి స్వతంత్ర అభ్యర్థిగా కొయిలాడ వెంకట జగదీశ్వరరావు అనే రౌడీషీటర్ నామినేషన్ వేశారు. ప్రతి ఆదివారం పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తుంటారు. ఈనెల 28న మల్కాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన కౌన్సెలింగ్‌కు జగదీశ్వరరావు హాజరయ్యాడు. కౌన్సెలింగ్ అనంతరం మిగిలిన రౌడీషీటర్లు అందరినీ ఇంటికి పంపించేసిన సీఐ సన్యాసినాయుడు ఇండిపెండెంట్‌గా నామినేషన్ వేసిన జగదీశ్వరరావును మాత్రం స్టేషన్‌లోని మొదటి అంతస్థుకు తీసుకువెళ్లి రెండున్నర గంటలపాటు నిర్బంధించారు. నామినేషన్‌ను వెనక్కి తీసుకోవాలంటూ అసభ్య పదజాలంతో దూషించి ఇబ్బందులకు గురిచేశారు. దీంతో జగదీశ్ స్టేషన్ మొదటి అంతస్థు నుంచి కిందికి దూకి పారిపోయేందుకు యత్నించగా సిబ్బంది పట్టుకున్నారు. ఇంటికి తీసుకువెళ్లి కుటుంబసభ్యులకు అప్పగించారు. జగదీశ్వరరావు శరీరంపై గాయాలు ఉండడంతో కుటుంబ సభ్యులు కేజీహెచ్‌కు తీసుకువెళ్లి ఎంఎల్‌సీ కేటగిరీలో చేర్పించి చికిత్స చేయించారు. సీఐ తన పట్ల వ్యవహరించిన తీరుపై ఆధారాలతో బాధితుడు జగదీశ్వరరావు పశ్చిమ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి హుస్సేన్ సాహెబ్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయడంతో విచారణ జరిపి నివేదిక ఇవ్వాలంటూ వెస్ట్ సబ్‌డివిజన్ ఏసీపీ అన్నెపు నర్సింహమూర్తిని ఆదేశించారు. విషయం సీపీ రవిశంకర్‌అయ్యన్నార్ దృష్టికి చేరడంతో సీఐ సన్యాసినాయుడును ఉద్యోగం నుంచి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. సస్పెన్షన్ సమయంలో ఉన్నతాధికారుల అనుమతి లేకుండా నగరాన్ని విడిచి బయటకు వెళ్లడానికి వీల్లేదని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

1,22,279 మంది పెన్షన్‌దారులకు బ్యాంకు ఖాతాలు

- మిగిలిన 42,620 మందికి ఇంటి వద్దే పింఛన్
- ఎవరూ సచివాలయాలకు రావలసిన అవసరం లేదంటున్న అధికారులు

విశాఖపట్నం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పింఛన్‌ను ఒకటో తేదీన బ్యాంకు ఖాతాలకు జమ చేయాలని, ఖాతాలు లేని వారికి, మాజీ సైనికులకు, మంచానపడిన వ్యక్తులకు, డయాలసిస్ రోగులకు మాత్రం ఇంటికి వెళ్లి ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో జిల్లా అధికారులు అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నారు. మే నెలకు సంబంధించి జిల్లాలో 1,64,899 మందికి పింఛన్లు అందజేయనున్నారు. ఇందుకు రూ.49,77,74,500 విడుదల చేశారు. మొత్తం 1,64,899 మందిలో 1,22,279 మందికి బ్యాంకు ఖాతాలు ఉన్నట్టు గుర్తించారు. వీరందరి ఖాతాలకు మే ఒకటో తేదీ లేదా రెండోతేదీకల్లా సొమ్ము జమ చేస్తారు. మిగిలిన 42,620 మందికి ఇంటి వద్దే పింఛన్ అందించేందుకుగాను సిబ్బంది ఖాతాలకు మంగళవారం సొమ్ము జమ చేస్తారు. అయితే బ్యాంకు ఖాతా నంబర్లు సక్రమంగా లేనిపక్షంలో మాత్రం పింఛన్ జమకాదు. అటువంటి వారికి మే మూడో తేదీన డ్రా చేసి పింఛన్‌దారుల ఇళ్లకు వెళ్లి పంపిణీ చేస్తారు. అంతే తప్ప పింఛన్‌దారులు గ్రామ/వార్డు సచివాలయాలకు రావల్సిన అవసరం లేదని అధికారులు తేల్చి చెబుతున్నారు.

రేషన్ డిపోలు విభజన అస్తవ్యస్తం

- ఆనందపురం ఎంఎల్ఎస్ పాయింట్ పరిధిలోకి ఇసుకతోట డిపో
- మర్రిపాలెం గోదాముకు గండిగుండం డిపో
- డీలర్ల అభ్యంతరాలు పట్టించుకోని అధికారులు
- 94 డిపోలకు సరకులు నిలిపివేత
- ఒకటో తేదీ నుంచి సరఫరా అనుమానమే

విశాఖపట్నం/అక్కయ్యపాలెం/ మర్రిపాలెం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) మండల స్టాకు పాయింట్ (పౌరసరఫరాల సంస్థ గోదాములు) నుంచి సరకు రవాణా వ్యయం తగ్గించాలన్న ఉద్దేశంతో చేపట్టిన రేషన్ డిపోల విభజన వివాదాస్పదమవుతోంది. మర్రిపాలెం గోదాము-2 పరిధిలో ఉన్న ఇసుకతోట ప్రాంతంలోని డిపో నంబరు 564ను తీసుకువెళ్లి ఆనందపురం గోదాముకు అనుసం ధానం చేశారు. ఆనందపురం మండలం గండిగుండం డిపోను తీసుకువచ్చి మర్రిపాలెం-1 గోదాముకు అటాచ్ చేశారు. ఇప్పటివరకూ వడ్లపూడి గోదాము పరిధిలోని సింధియా ప్రాంతంలో ఉన్న రెండు డిపోలను మర్రి పాలెం గోదాము-1కు అటాచ్ చేశారు. ఈ నేపథ్యంలో మర్రిపాలెంలో గోదాము-2 నుంచి గోదాము-1కు 94 డిపోలను కేటాయించారు. ఇలా కేటాయించిన 94 డిపో లకు ఒకటో తేదీ నుంచి కార్డుదారులకు సరకులు పంపి ణీ చేయాల్సి ఉన్నా... ఇంతవరకూ స్టాకు కేటా యించలేదు.

ఎంఎల్‌ఎస్ పాయింట్ల (గోదాములు) నుంచి డిపోలకు సరకుల సరఫరా ఖర్చును తగ్గించడానికి రూట్ ఆప్టిమైజేషన్ అనే ... మిగతా 8వ పేజీలో

ఐఏఎస్ అధికారికి గ్రేటర్ నజరానా!

నగరంలో ఆయన భార్య పేరిట ఉన్న భవనాన్ని గెస్ట్ హౌస్ కింద అద్దెకు తీసుకున్న జీవీఎంసీ

- నెలకు రూ.లక్షల్లో చెల్లింపు
- సదరు అధికారికి ప్రయోజనం కల్పించేందుకే...
- పైనుంచి వచ్చిన ఆదేశాల మేరకు స్థానిక అధికారుల నిర్ణయం
- సర్వత్రా విమర్శలు



విశాలాక్షినగర్‌లోని జీవీఎంసీ గెస్ట్‌హౌస్ కోసం అద్దెకు తీసుకున్న భవనం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఎప్పుడొస్తారో...ఒకవేళ వచ్చినా సరే అక్కడ బస చేస్తారో లేదో గ్యారంటీ కూడా లేదు. అయినా అతిథుల కోసమంటూ గ్రేటర్ విశాఖపట్నం మునిసిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) అధికారులు ఒక భవనాన్ని గెస్ట్‌హౌస్ పేరుతో అద్దెకు తీసుకుని నెలకు రూ.లక్షలు చెల్లిస్తున్నారు. ఒకవేళ గెస్ట్‌హౌస్ కోసం భవనం అద్దెకు తీసుకోవాలనుకుంటే టెండర్ ప్రకటన ఇవ్వాలి. కానీ, అధికారులు మాత్రం ఎందుకనో రహస్యంగా తతంగం నడిపించారు. ఇదంతా ఒక ఐఏఎస్ అధికారికి లబ్ధి చేకూర్చేందుకేనని విపక్షాలు విమర్శిస్తున్నాయి.

పురపాలక, పట్టణాభివృద్ధి శాఖకు సంబంధించిన వివిధ పనులు, సమీక్షలు, సమావేశాల కోసం కేంద్ర, రాష్ట్ర స్థాయి అధికారులు నగరానికి వస్తే స్టార్ హోటళ్లలో బస చేస్తుంటారు. వారికి సంబంధించిన వసతి, భోజనం, రవాణా ఖర్చులను జీవీఎంసీయే భరిస్తుంది. అలాంటి అతిథులు నగరానికి రావడం అరుదనే చెప్పుకోవాలి. వారు నోవాటెల్, గేట్‌వే, గ్రాండ్‌బే, రాడిసన్‌బ్లూ వంటి స్టార్ హోటళ్లలో బస చేసినా ఖర్చు గరిష్ఠంగా నెలకు రూ.లక్షకు మించదు. కానీ, అతిథుల కోసమంటూ జీవీఎంసీ అధికారులు నెలకు రూ.లక్షల్లో అద్దె చెల్లించేందుకు సిద్ధమై ఒక భవనాన్ని గెస్ట్ హౌస్‌గా తీసుకున్నారు.

అసలు ఏం జరిగిందంటే...

రాష్ట్ర రాజధానిలో కీలక పోస్టులో ఉన్న ఒక ఐఏఎస్ అధికారికి నగరంలోని విశాలాక్షి నగర్‌లో ఐదంతస్థుల భవనం ఉంది. కొద్దినెలల కిందటే దీని నిర్మాణం పూర్తయ్యింది. ఒక్కో అంతస్థు 1,750 చదరపు అడుగులు చొప్పున, ఐదు అంతస్తులు కలిపి 8,500 చదరపు అడుగుల విస్తీర్ణం ఉంటుంది. దీనికి రెసిడెన్షియల్ కేటగిరీ కింద జీవీఎంసీ రెవెన్యూ అధికారులు ... మిగతా 8వ పేజీలో

చర్చలకు ముందుకురాని అదానీ

గంగవరం పోర్టులో కొనసాగుతున్న నిర్వాసిత కార్మికుల సమ్మె

- భారం జిల్లా అధికారులపైకి నెట్టి చోద్యం చూస్తున్న యాజమాన్యం
- పైగా సమ్మెకు సహకరిస్తున్నారని ఐదుగురు ఉద్యోగుల సస్పెన్షన్
- మరో ముగ్గురు ఇతర రాష్ట్రాలకు బదిలీ
- మరోవైపు కలెక్టర్ అభ్యర్థనను తోసిపుచ్చిన నిర్వాసిత కార్మికులు



కార్మిక శాఖ అధికారికి లేఖ సమర్పిస్తున్న పోర్టు నిర్వాసిత కార్మికులు

- వన్‌టైమ్ సెటిల్‌మెంట్‌కు అంగీకరిస్తే సమ్మె విరమిస్తామని స్పష్టీకరణ
- సమస్య కొనసాగితే ఎన్నికలు బహిష్కరిస్తామని వెల్లడి

విశాఖపట్నం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): అదానీ గంగవరం పోర్టులో నిర్వాసిత కార్మికులు చేపట్టిన సమ్మె 20వ రోజుకు చేరింది. ఆందోళనకారులంతా చర్చలకు ఎక్కడకు రమ్మంటే అక్కడకు వస్తుంటే...పోర్టు యాజమాన్యం మాత్రం ఒక్క అడుగు కూడా ముందుకు వేయడం లేదు. కార్మికుల డిమాండ్లపై నోరు విప్పడం లేదు. ఈ సమస్యలో తాము జోక్యం చేసుకోబోమని, రాష్ట్ర, జిల్లా అధికారులే పరిష్కరించాలన్నట్టుగా వ్యవహరిస్తోంది. విశాఖపట్నం స్టీల్‌ప్లాంటుకు ఎంత నష్టం జరిగితే తనకు అంత లాభం అన్నట్టు ఉంటోంది.

కలెక్టర్ అభ్యర్థనను తోసిపుచ్చిన కార్మికులు

నిర్వాసిత కార్మికులతో విశాఖ జిల్లా కలెక్టర్ మల్లికార్జున ఆదివారం సాయంత్రం చర్చలు జరిపారు. పోర్టులో రెండు లక్షల టన్నుల కోల్ ఉండిపోయిందని, అందులో 40 శాతం వెంటనే కన్వేయర్ బెల్ట్ ద్వారా తరలించేందుకు సహకరించాలని కోరారు. అలా చేస్తే పోర్టు యాజమాన్యంతో తాను చర్చలు జరిపి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అయితే దానికి కార్మికులు అంగీకరించలేదు. గత ఏడాది ఆగస్టులో ఇలాగే చర్చలు జరిపి తీర్మానం చేశారని, ప్రమాదవశాత్తూ ఎవరైనా చనిపోతే రూ.25 లక్షల పరిహారం ఇవ్వడానికి పోర్టు ప్రతినిధులు అంగీకరించారని, దానిని అమలు చేయలేదని ఆరోపించారు. ఆ తీర్మానం తరువాత ఇద్దరు కార్మికులు ప్రమాదవశాత్తూ చనిపోతే అందులో ఒక్కరికే రూ.8 లక్షలు ఇచ్చి మోసం చేశారని, ... మిగతా 8వ పేజీలో

‘ఉత్తరం’లో 15 మంది.. ‘దక్షిణం’లో 16 మంది

» రెండు నియోజకవర్గాల్లో నామినేషన్ల ఉపసంహరణ అనంతరం పోటీలో మిగిలిన అభ్యర్థులు

సీతమ్మధార, ఏప్రిల్ 29: ఉత్తర నియోజకవర్గంలో 15 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచినట్టు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అఖిల తెలిపారు. సోమవారం నామినేషన్ల ఉపసంహరణ ముగిసింది. తొలుత 24 మంది అభ్యర్థులు నామినేషన్ పత్రాలను సమర్పించగా, అందులో స్క్రూటినీ అనంతరం 17 మంది దరఖాస్తులను ఆమోదించినట్టు ఆర్వో తెలిపారు. ఇందులో ఇండిపెండెంట్‌గా దరఖాస్తులు చేసిన సుమ కమ్మిల, చెంచల మల్లికార్జునరావు తమ నామినేషన్లను విత్‌డ్రా చేసుకున్నారు. ఇప్పుడు బరిలో కన్నపురాజు కమ్మిల (కేకే రాజు వైసీపీ), పెద్దడ కనకమహాలక్ష్మి (బీఎస్‌పీ), లక్కరాజు రామారావు (ఐఎన్‌ఎస్ కాంగ్రెస్ పార్టీ), పెనుమత్స విష్ణుకుమార్ రాజు (బీజేపీ), గుంపుల శరత్‌బాబు (సమాజ్‌వాది పార్టీ), చింతాడ సూర్యం (నభ భారత్ నిర్మాణ సేవ పార్టీ), పి.జగదీష్ (జాతీయ జనసేన పార్టీ), వీవీ లక్ష్మీనారాయణ జైభారత్ నేషనల్ పార్టీ, కోనేటి ఈశ్వర వీరదభద్రచారి, సప్ప రామునాయుడు, బొడ్డు శ్రీనివాస్, బొర్ర రమేష్ , ఎలమంచిలి సాహితి , రోణంకి చలపతిరావు, వడ్డీ శిరిషలు ఇండిపెండెంట్ అభ్యర్థులుగా పోటీలో నిలిచినట్టు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, తహసీల్దార్ శ్రీరామమూర్తి వివరించారు.

దక్షిణ నియోజకవర్గం బరిలో..

మహారాణిపేట: దక్షిణ నియోజకవర్గ బరిలో 16మంది నిలిచారు. నామినేషన్ వేసిన 19 మందిలో సోమవారం ముగ్గురు ఉపసంహరించుకున్నారు. వారిలో బి రోహిత్‌కుమార్, మోయ స్వామిబాబు, చెన్ను బోయిన పద్మజ ఉన్నట్టు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి తెలిపారు. దీంతో బరిలో మొత్తం 16 మంది పోటీలో మిగిలారు. వీరిలో జనసేన అభ్యర్థిగా వంశీకృష్ణ శ్రీనివాస్, వైసీపీ అభ్యర్థిగా వాసుపల్లి గణేష్‌కుమార్ , కదిరి రాము బహుజన్ సమాజ్ పార్టీ, కాంగ్రెస్ అభ్యర్థిగా వాసుపల్లి సంతోష్ కుమార్, జై మహా భారత్ పార్టీ తరఫున కుంబేటి శ్రీదేవి, భారతీయ రాష్ట్రీయ దళ్ అభ్యర్థిగా దుర్గా ప్రసాద్ గునులు, ప్రజా ప్రస్థానం అభ్యర్థిగా బూర శ్రీనివాసరావు, యర్రం శెట్టి సురేష్ కుమార్... జై భారత్ నేషనల్ పార్టీ, రావాడ తాతారావు.. నవ భారత నిర్మాణసేవా పార్టీ, బుద్ధవరపు వంశీకీర్తి కుమార్..జాతీయజనసేన పార్టీ, సూరాడ ఎల్లాజీ సమాజ్‌వాది పార్టీ, కడగల ఈశ్వరరావు, కిలపర్తి మంగరత్నం, డోలా జగదీష్, లోగిశెట్టి తారక రామ్, జే బిపిన్ కుమార్ జైన్ ఇండిపెండెంట్ అభ్యర్థులుగా నిలిచారు. వీరిలో జే బిపిన్ కుమార్ జైన్ వైసీపీ 31వ వార్డు కార్పొరేటర్ వ్యవహరిస్తున్నారు. ఎన్నికలలో అతను ఆపార్టీ రెబెల్‌గా పోటీ చేయడం గమనార్హం.

ప్రచార ఖర్చును పరిశీలకులకు అందించాలి...

సీతమ్మధార: ఎన్నికల్లో అభ్యర్థుల ప్రచార ఖర్చు వివరాలను మూడు విడతుల్లో పరిశీలకునికి తెలపాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి డి.అఖిల తెలిపారు. మొదటి విడతగా మే1వ తేదీన, రెండో విడతగా మే 6న, మూడో విడతగా మే 11న ఎన్నికల వ్యయంను తనిఖీ చేయించుకోవాలని తెలిపారు. పోటీలో ఉన్న అభ్యర్థులు, ఏజెంట్లు వారు నామినేషన్ వేసిన తేదీ నుంచి ఏప్రిల్ 30 వరకు వారికి ఇచ్చిన అకౌంట్ రిజిస్టర్లలో నమోదు చేసి సంబంధిత రసీదులు, ఓచర్లు, బ్యాంక్ పాస్ పుస్తకంతో వెళ్లి మే1వ తేదీన ఆథరైజ్డ్ ఏజెంట్ జోనల్ కమిషన్ వారి కార్యాలయం జ్ఞానాపురంలో తనిఖీ చేయించుకోవాలని తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న ఉత్తర నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి అఖిల

రైతుబజారులో తూనికల శాఖాధికారులు తనిఖీలు



రైతులకు సూచలను చేస్తున్న అధికారులు

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 29 : గ్రేటర్ 45వ వార్డు నరసింహనగర్ రైతుబజారులో తూనికలు, కొలతల శాఖ అధికారులు సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. జిల్లా కంట్రోలర్ కేటీ రవికుమార్, అసిస్టెంట్ కంట్రోలర్ పీడీవీ అప్పలరాజు, వెయింగ్ ఇన్‌స్పెక్టర్ వి.రామారావు వినియోగదారులు తీసుకునే కూరగాయలు తగిన బరువు ఉందా? లేదా అలాగే రైస్ బ్యాగులను తనిఖీ చేశారు. రైతులు, డ్వాక్రా గ్రూపులు, కిరాణా దుకాణాల వారి కాటాలను పరిశీలించి గడువులోగా కాటాలకు సీలు వేయించుకోవాలని సూచించారు. రైతుబజారు ఎస్టేట్ అధికారి పి. చిన్నబాబు, సహాయకుడు ఆర్. సత్యనారాయణ ఉన్నారు.

నిరుద్యోగ సమస్యను పరిష్కరిస్తా..

జై భారత్ పార్టీ అధ్యక్షుడు వి.వి.లక్ష్మీనారాయణ



ఓటర్లకు అభివాదం చేస్తున్న లక్ష్మీనారాయణ

మాధవధార, ఏప్రిల్ 29; ప్రజల మద్దతుతో తనను ఆంధ్రప్రదేశ్ శాసనసభకు పంపితే నిరుద్యోగ సమస్య పరిష్కారానికి పోరాడతానని జై భారత్ పార్టీ అధ్యక్షులు వి.వి.లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం మురళీనగర్ ప్రాంతాల్లోని నివాసిత కాలనీల్లో ప్రచారం చేశారు. పార్టీ మేనిఫెస్టోని ప్రజలకు వివరించారు. డ్రగ్స్, గంజాయి, మత్తు పదార్థాల రవాణాని అరికట్టే విధంగా చర్యలు తీసుకుంటానని ప్రజలకు హామీ ఇచ్చారు. స్టీల్ ప్లాంట్ రక్షణకు నిర్మాణాత్మక పోరాటం చేస్తున్న తనకు, పార్టీ అభ్యర్థులను ప్రజలు మద్దతిచ్చి ఎన్నికల్లో ఓటేసి గెలిపించాలన్నారు. ప్రచారంలో పార్టీ నాయకులు, మద్దతుదారులు ఉన్నారు.

షిర్డీ సాయి ఆలయ వార్షికోత్సవం

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 29: సౌత్ షిర్డీ సాయిబాబా ఆలయ 26వ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. మందిర్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో అర్చకులు సాయినాథునికి ప్రత్యేక పూజలను నిర్వహించారు.శ్రీ గీతా ప్రచార సమితి ఆధ్వర్యంలో సంపూర్ణ గీతా పారాయణం నిర్వహించారు. ఆలయ అధ్యక్షులు జి.నూకేశ్వరరావు, కార్యదర్శి సీహెచ్ కృష్ణమూర్తి, ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్, సీహెచ్‌వీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



అలంకరణలో షిర్డీసాయి

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అక్కయ్యపాలెం: నిర్వహణ పనులు చేపడుతున్నందున తాటిచెట్లపాలెం సెక్షన్ 11 పరిధిలో మంగళవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ వీవీ మహేశ్వర రెడ్డి తెలిపారు. ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్ ఏరియా, సాయిబాబా ఆలయం నుంచి ఎనభై అడుగుల రోడ్డు వరకు ఉన్న ప్రాంతాలు, పాత పోస్టాఫీసు రోడ్డు ఏరియా, మహారాణి పార్లర్ ఏరియాల్లో కరెంట్ సరఫరా ఉండదు.



గ్రేటర్ 37 వార్డులో సినీనటుడు పృథ్వీతో కలసి వంశీకృష్ణ ప్రచారం



జనసేనలో చేరిన మత్స్యకారులు

దోపిడీకి కేరాఫ్‌గా జగన్ పాలన

» సినీ నటుడు పృథ్వీ » దక్షిణ నియోజకవర్గంలో విస్తృత ప్రచారం

జగదాంబ కూడలి, ఏప్రిల్ 29: ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ రాష్ట్రాన్ని దోపిడీ చేశారని జనసేన నాయకుడు, సినీనటుడు పృథ్వీ అన్నారు. సోమవారం గ్రేటర్ 37వ వార్డు పరిధిలో గొల్లవీధి వద్ద జరిగిన ఎన్నికల ప్రచార సభలో దక్షిణం జనసేన అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్‌తో కలసి మాట్లాడారు. జగన్ అండ్ కో దోచుకొని, దాచుకోవడం తప్ప ప్రజలకు చేసేందేమీలేదన్నారు. వైసీపీ జగన్ పాలనలో అన్ని వర్గాల ప్రజానీకం ఇబ్బందికి లోనయ్యారని విమర్శించారు. జగన్ మాయమాటలకు మోసపోవద్దంటూ మహిళలను హెచ్చరించారు. ఏపీలో కూటమి అధికారంలోకి వస్తేనే భవిష్యత్తు ఉంటుందని అన్నారు. దక్షిణంలో ప్రస్తుత ఎమ్మెల్యే వాసుపల్లిని ఇంటికి పంపాలన్నారు. కూటమి అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్, ఎంపీ అభ్యర్థి శ్రీభరత్‌లను గెలిపించాలని ప్రజలను కోరారు. భజనకోవెల, యాతవీధి, బ్రహ్మంగారివీధి, స్కీం బిల్డింగ్ ప్రాంతాల్లో ఈ ప్రచారం సాగింది. మూడు శ్రేణులు పాల్గొన్నాయి. రాత్రి పూర్ణామార్కెట్ వద్ద ప్రచారం చేశారు.

జనసేన పార్టీలో మత్స్యకారులు చేరిక

మహారాణిపేట: ఫిషింగ్ హార్బర్‌కు చెందిన పలువురు మత్స్యకారులు జనసేన పార్టీలోకి చేరారు. సోమవారం శ్రీ గంగాభవానీ ఫిషింగ్ హార్బర్ చేపల వేలందారులు సంక్షేమ సంఘం కార్యవర్గ సభ్యులతోపాటు పలు మత్స్యకారులు వంశీకృష్ణ శ్రీనివాస్ వారికి కండువాలువేసి పార్టీలోకి ఆహ్వానించారు. మత్స్యకారులు గంటు నూకరాజు, మూగి రాజ్‌కుమార్, జోగి సుధాకర్, దుంప ఈశ్వర్ పాల్గొన్నారు.

వంశీకృష్ణ సతీమణి ప్రచారం

డాబాగార్డెన్స్/ అల్లిపురం: వంశీకృష్ణ శ్రీనివాస్‌యాదవ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వంశీకృష్ణ సతీమణి పద్మజ ఓటర్లను కోరారు. సోమవారం డాబాగార్డెన్స్‌లోని పలు ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. దక్షిణ నియోజకవర్గంలో జనసేన అభ్యర్థి వంశీకృష్ణ గెలుపు తథ్యమని 32వార్డు జనసేన నాయకులు, కార్పొరేటర్ కందుల నాగరాజు అన్నారు. సోమవారం వంశీకృష్ణకు మద్దతుగా వార్డులో విస్తృత ప్రచారం చేశారు. అధికార మార్పుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని వివరించారు. జనసేనకు ప్రజలనుంచి స్పందన లభిస్తుందన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న విష్ణుకుమార్‌రాజు



104 ఏరియాలో ప్రచారం చేస్తున్న బీజేపీ మద్దతుదారులు

ప్రజల ఆస్తులు దోచుకోవడానికే జీవో 512

» ఉత్తర నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి విష్ణుకుమార్ రాజు

సీతమ్మధార, ఏప్రిల్ 29: ప్రజల ఆస్తులను ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తన చేతుల్లో పెట్టుకోవడానికి, దోచుకోవడానికే జీవో 512 దోహదపడుతుందని మాజీ ఎమ్మెల్యే, ఉత్తర నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి విష్ణుకుమార్ రాజు ఆరోపించారు. సీతమ్మధారలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆస్తులపై ప్రజలు ఎటువంటి నిర్ణయం తీసుకోకుండా చేస్తున్న ఈ జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల నియమావళి అమలులో ఉండగా ఇలా జీవోలు, మెమోలు జారీ జారీ చేయడం అత్యంత దారుణమన్నారు. ఈ జీవోపై ప్రజలతోపాటు న్యాయవాదులూ వ్యతిరేకిస్తూ నిరసనలు, నిరాహార దీక్షలు చేస్తున్నా, ఇవేమీ పట్టించుకోకుండా సామాన్యుడికి ఇబ్బంది పెట్టేలా ఈ ప్రక్రియను జగన్మోహన్‌రెడ్డి చేయడం చాలా తప్పని అని అన్నారు. తక్షణం జీవో రద్దు చేయాలని, లేకుంటే కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే రద్దు చేసి ప్రజల ఆస్తులను కాపాడుతామని తెలిపారు. ఇలా జీవోలు తీసుకువచ్చే జగన్‌లాంటి ముఖ్యమంత్రికి ఓటు వేస్తే ఇంకెలాంటి పరిణామాలు ఉంటాయోనని హెచ్చరించారు. విశాఖలో పాలిటెక్నికల్ కాలేజీ, ఆర్‌అండ్‌బీ ఆఫీస్, ఎంఆర్‌ఓ ఆఫీస్ తదితర ఆస్తులన్నీ తాకట్టు పెట్టారన్నారు. ఇప్పుడు ప్రభుత్వ స్థలాల్లో లబ్ధిదారులకు నిర్మిస్తున్న ప్రధాన మంత్రి ఆవాజ్ యోజన ఇళ్లను తాకట్టు పెట్టకుండా ఉండరని గ్యారెంటీ ఏమిటని విష్ణుకుమార్ రాజు ప్రశ్నించారు. చంద్రబాబు హుదూద్ తుఫాన్ సమయంలో చేసిన సేవలను గుర్తుంచుకోవాలన్నారు. 14 ఏళ్లుగా ముఖ్యమంత్రిగా ఆయన చేసిన అభివృద్ధిని చూసి కూటమికి ఓటు వేయాలని కోరారు. ఎయిర్‌పోర్టులో చంద్రబాబును అడ్డుకుని అరాచకం సృష్టించే కేకే రాజును రౌడీ రాజు అనడంలో సందేహించాల్సిన అవసరంలేదన్నారు. వార్డు సచివాలయాలను సామాజిక భవనాల్లో నిర్వహించకుండా చూస్తామన్నారు. అన్న క్యాంటీన్లను తెరుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సమన్వయకర్త ఎండీ నజీర్, జనసేన పార్టీ నాయకులు పసుపులేటి ఉషాకిరణ్, డాక్టర్ రఘు పాల్గొన్నారు.

54వవార్డులో బీజేపీ విస్తృత ప్రచారం

మురళీనగర్: 54వవార్డు ప్రాంతాల్లో సోమవారం బీజేపీ నాయకులు విస్తృత ప్రచారం చేపట్టారు. కూటమి అభ్యర్థి పెన్మెత్స విష్ణుకుమార్ రాజుని ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరుతు ఆయన అల్లుడు సునీల్ కుమార్ ఇంటింటి ప్రచారం చేశారు. గతంలో ఎమ్మెల్యేగా పని చేసిన అనుభవమున్న నిస్వార్థ నేత విష్ణుకుమార్ రాజు ఓటు వేసి గెలిపించాలని కోరుతూ కరపత్రాలు అందించారు. 104 ఏరియా, బాపూజీ నగర్, పాత పోలీస్‌స్టేషన్ ఏరియా, జ్యోతినగర్ ప్రాంతాల్లో పర్యటించారు.

‘కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యం’

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 29: 31వ వార్డులో కూటమి అభ్యర్థుల గెలుపు లక్ష్యంగా కృషి చేస్తున్నట్టు టీడీపీ వార్డు అధ్యక్షుడు బత్తిన నాగరాజు అన్నారు. వార్డు పరిధిలోని కనకలవీధి, తదితరప్రాంతాల్లోఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు.

సేవకుడిలా పనిచేస్తా..

» వైసీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కేకే రాజు



మాట్లాడుతున్న వైసీపీ అభ్యర్థి కేకే రాజు

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 29: ఎన్నికల్లో తనను గెలిపిస్తే నాయకునిలా కాకుండా సేవకునిగా అన్ని విధాల అందుబాటులో ఉండి పని చేస్తానని వైసీపీ ఉత్తరం ఎమ్మెల్యే అభ్యర్థి కేకే రాజు అన్నారు. 45వ వార్డు నరసింహనగర్‌లో కార్పొరేటర్, డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ కంపా హనోక్ ఆధ్వర్యంలో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నియోజకవర్గంలో రూ.435 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్టు తెలిపారు. వైసీపీ అధ్యక్షుడు పైడి రమణ, యాత కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లి సుజాత, డైరెక్టర్ రాయుడు శ్రీనివాస్ పాల్గొన్నారు. కేకే రాజు సమక్షంలో అక్కయ్యపాలెంలోని శివరామిరెడ్డి స్వీట్స్ అధినేత శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో పలువురు వైసీపీలో చేరారు. ఎంపీ అభ్యర్థిని బొత్స ఝాన్సీ లక్ష్మి, సిక్ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ ఆనంద్ సింగ్, జగదీష్, జీవీ రమణి పాల్గొన్నారు.

ప్రత్యేక హాకర్స్ జోన్ ఏర్పాటుకు కృషి...

ఫ్రూట్స్, పూలు, వెజిటబుల్స్ అసోసియేషన్ సభ్యులు, ఇతర వ్యాపారాలు చేసుకునే వారి కోసం ప్రత్యేక హాకర్స్ జోన్ ఏర్పాటు చేస్తానని కేకే రాజు హామీ ఇచ్చారు. తాటిచెట్లపాలెం ఎనభై అడుగుల రోడ్డు, పరిసర ప్రాంతాల ఫ్రూట్స్ మర్చంట్స్ సంఘాలతో సమావేశం నిర్వహించారు. పరిశీలకుడు చొక్కాకుల వెంకటరావు, 45, 55 వార్డుల కార్పొరేటర్లు కంపా హనోక్, కేవీఎన్ శశికళ, వైసీపీ అధ్యక్షుడు పైడి రమణ తదితరులు పాల్గొన్నారు.రామకృష్ణానగర్ షిర్డీ సాయిమందిరంలో అన్నసమారాధనను రాజు ప్రారంభించారు. బొడ్డేటి కిరణ్, జేసీఎస్ కన్వీనర్ జగదీష్ పాల్గొన్నారు.

టీడీపీ, బీజేపీ నుంచి వైసీపీలో చేరికలు

సీతమ్మధార: 55వ వార్డు ధర్మానగర్‌లోని టీడీపీ, బీజేపీలకు చెందిన నాయకులు, మహిళలు, కార్యకర్తలు వార్డు నాయకుడు భద్రి ఆధ్వర్యంలో వైసీపీలో చేరారు. వీరికి కేకే రాజు ఆహ్వానించారు.

మురళీనగర్, ఉత్తర నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చి దిద్దుతానని కేకే రాజు అన్నారు. 51వవార్డు మారియట్ హోటల్ నుంచి పాదయాత్రగా వెళ్లి పలు కాలనీల్లో ప్రచారం చేశారు. ప్రజల్ని మరోసారి మోసం చేయడానికి కూటమి పార్టీలు ప్రయత్నాలు చేస్తున్నాయన్నారు. అనంతరం అక్కయ్యపాలెం షాదీ ఖానా కల్యాణమండపంలో ఏర్పాటు చేసిన ముస్లింల ఆత్మీయ సమావేశానికి తరలి వెళ్లారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

కంచరపాలెం, ఏప్రిల్ 29 : మార్కెట్‌కు అని బయటకు వెళ్లిన మహిళ తిరిగి ఇంటికి రాకపోవడంతో కంచరపాలెం పోలీస్ స్టేషన్‌లో అదృశ్యం కేసును నమోదైంది. వివరాలివి.. కంచరపాలెం పరిధి కప్పరాడ రాంజీ ఎస్టేట్ ప్రాంతానికి చెందిన మెరుగు సంధ్యారాణి (33), భర్త చనిపోవడంతో తండ్రి వద్ద ఉంటున్నారు. ఈనేపథ్యంలో ఈనెల 13వ తేదీన సంధ్యారాణి మార్కెట్‌కు వెళ్తున్నట్టు చెప్పి బయటకు వెళ్లారు. ఎంతకీ ఇంటికి తిరిగిరాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆమె కోసం పరిసరాలు ,బంధువుల ఇళ్లల్లో వెతికారు. ఆచూకీ తెలియకపోవడంతో తండ్రి రమేష్ బాబు పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసును నమోదు చేసి సీఐ భాస్కరరావు నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ కె.కృష్ణకుమారి కేసును దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి ఓటరు స్లిప్‌లు పంపిణీ

జ్ఞానాపురం, ఏప్రిల్ 29: ప్రతి ఓటర్లకు వారి ఓటు, పోలింగ్ కేంద్రాలతో వివరాలతో స్లిప్‌లను మంగళవారం నుంచి పంపిణీ చేస్తున్నట్టు పశ్చిమ ఈఆర్‌ఓ హుస్సేన్ సాహెబ్ తెలిపారు. సోమవారం స్థానిక కార్యలయంలో ఓటరు స్లిప్‌లను పరిశీలించి బీఎల్‌వోలకు అందజేశారు.త్వరతగతిన స్లిప్‌లను ఓటర్లకు అందజేయాలని సూచించారు.

ముగిసిన నామినేషన్ల ఘట్టం

... 7వ పేజీ తరువాయి

చింతాడ సూర్యం (నవ భారత నిర్మాణ సేవా పార్టీ), జాలాది విజయకుమారి (సమాజ్‌వాదీ), తోట వెంకటసాయి ముకుంద్ (ప్రజా ప్రస్థానం పార్టీ), బన్నా రమేశ్(దళిత బహుజన పార్టీ), బిక్కవోలు చలమాజీ (నవరంగ్ కాంగ్రెస్ పార్టీ), వాంద్రాసి నాగ సత్యనారాయణ (రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్), పి.సత్యవతి (పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా) బరిలో మిగిలారు.

స్వతంత్రులు

ప్రధాన, రిజిస్టర్డ్ పార్టీల అభ్యర్థులు కాకుండా మరో 15 మంది స్వతంత్ర అభ్యర్థులుగా పోటీలో నిలిచారు. వీరిలో మురల అరుణశ్రీ, జీఏఎన్ ఆనంద్, కొల్లి నాగరాజు, మొహ్మద్ గౌస్ మొహిద్దీన్ ఖాన్, చప్పిడి రాము, పొన్నాడ జనార్దన్, పీడిది అప్పారావు, మళ్ల శ్రావణి, మెట్ట రామారావు, లగుడు గోవిందరావు, వడ్డి హరి గణేశ్, కర్రి వేణు మాధవ్, దేవర శంకర్, వాసుపల్లి సురేశ్, సొండి కృష్ణ ఉన్నారు.

అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా...

భీమిలి నియోజకవర్గంలో ఇద్దరు నామినేషన్లు ఉపసంహరించుకోగా 15 మంది పోటీలో ఉన్నారు. ప్రధాన పోటీ గంటా శ్రీనివాసరావు (టీడీపీ), ముత్తంశెట్టి శ్రీనివాసరావు (వైసీపీ) మధ్య జరగనున్నది. విశాఖ తూర్పు నియోజకవర్గంలో ఒకరు నామినేషన్ ఉపసంహరించుకోవడంతో 14 మంది బరిలో ఉన్నారు. తెలుగుదేశం అభ్యర్థిగా వెలగపూడి రామకృష్ణబాబు, వైసీపీ తరఫున ఎంవీవీ సత్యనారాయణ, కాంగ్రెస్ నుంచి గుత్తల శ్రీనివాసరావు పోటీలో ఉన్నారు. అలాగే దక్షిణ నియోజకవర్గంలో సోమవారం ముగ్గురు నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. చివరకు 16 మంది మిగిలారు. ఇక్కడ జనసేన నుంచి సీహెచ్ వంశీకృష్ణశ్రీనివాస్, వైసీపీ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అభ్యర్థులుగా ఉన్నారు. విశాఖ ఉత్తర నియోజకవర్గంలో చివరిరోజు ఇద్దరు నామినేషన్లు ఉపసంహరించుకోగా బరిలో 15 మంది ఉన్నారు. బీజేపీ నుంచి పి.విష్ణుకుమార్‌రాజు, వైసీపీ తరఫున కేకే రాజు, జైభారత్ పార్టీ నుంచి వీవీ లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ నుంచి లక్కరాజు రామారావు బరిలో ఉన్నారు. పశ్చిమ నియోజకవర్గంలో ముగ్గురు నామినేషన్లు ఉపసంహరించుకోవడంతో 13మంది పోటీలో ఉన్నారు. తెలుగుదేశం పార్టీ తరఫున పి.గణబాబు, వైసీపీ తరఫున ఆడారి ఆనందకుమార్, సీపీఐతరఫున ఎ.విమల పోటీ చేస్తున్నారు.గాజువాకలో ఇద్దరు నామినేషన్లు ఉపసంహరించుకోగా, పోటీలో 15 మంది మిగిలారు. పల్లా శ్రీనివాసరావు (తెలుగుదేశం), గుడివాడ అమర్‌నాథ్ (వైసీపీ), సీపీఎం నుంచి మరడాన జగ్గునాయుడు అభ్యర్థులుగాఉన్నారు.పెందుర్తిలోసోమవారంనలుగురు నామినేషన్లు ఉపసంహరించుకోవడంతో 14మంది పోటీలో ఉన్నారు. జనసేన తరఫున పంచకర్ల రమేష్‌బాబు, వైసీపీనుంచిఅన్నంరెడ్డి అదీప్‌రాజ్, కాంగ్రెస్ అభ్యర్థిగా పిరిడి భగత్ బరిలో ఉన్నారు.

చర్చలకు ముందుకురాని ‘అదానీ’

... 7వ పేజీ తరువాయి

పోర్టు యాజమాన్యం మాటపై నిలబడడం లేదని, అందుకే తాము ఒప్పుకోవడం లేదని స్పష్టంచేశారు.

కార్మిక శాఖ కార్యాలయంలో చర్చలు

విశాఖపట్నం కార్మిక శాఖ అధికారి కార్యాలయంలో సోమవారం సాయంత్రం నిర్వాసిత కార్మికులతో చర్చలు జరిపారు. స్టీల్‌ప్లాంటు ఇబ్బందుల్లో ఉన్నందున సహకరించాలని, సమ్మె విరమించాలని ఆయన కోరారు. ముందస్తు నోటీసు ఇవ్వకుండా సమ్మె చేయడం తగదని చెప్పారు. దీనికి కార్మికులు బదులిస్తూ, గతంలో 64 రోజులు సమ్మె చేసినా సమస్యలు పరిష్కరించలేదని, అందుకే ఇలా చేయాల్సి వచ్చిందన్నారు. తమను వన్‌టైమ్ సెటిల్‌మెంట్‌కు రమ్మని చెప్పినందున ఒక్కొక్కరికి రూ.50 లక్షలు కావాలని అడిగామని, అనేక చర్చలు జరిపిన మీదట రూ.35 లక్షలకు దిగి వచ్చామన్నారు. పోర్టు యాజమాన్యం దానికి అంగీకరిస్తే ఈ క్షణమే సమ్మె విరమిస్తామన్నారు. డబ్బులు కూడా వెంటనే ఇవ్వాల్సిన అవసరం లేదని, నెల రోజులు గడువు తీసుకొని ఇవ్వవచ్చునన్నారు. ఇంతకు మించి తాము చెప్పేదేమీ లేదని పేర్కొంటూ అదే డిమాండ్‌తో కార్మిక శాఖ అధికారికి లేఖ సమర్పించారు. సమస్యను ఇలాగే కొనసాగిస్తే ప్రస్తుతం జరుగుతున్న సాధారణ ఎన్నికలను కూడా తాము బహిష్కరిస్తామని స్పష్టంచేశారు.

కార్మికులపై యాజమాన్యం వేటు

అదానీ గంగవరం పోర్టులో రెండు వేల పైచిలుకు ఉద్యోగులు ఉన్నారు. వారిలో నిర్వాసిత కార్మికులు 500 మంది. వీరు కాకుండా మిగిలిన వారిని యాజమాన్యమే నియమించుకుంది. నిర్వాసిత కార్మికుల సమ్మె మొదలైన తరువాత వారి నాయకుల్లో 12 మందిపై పోలీసులతో కేసు పెట్టించారు. ఆపరేషన్లు నిలిచిపోవడానికి లోపల కూడా కొంతమంది సహకరిస్తున్నారనే ఆరోపణలతో ఐదుగురు ఉద్యోగులను సస్పెండ్ చేశారు. మరో ముగ్గురిని పశ్చిమ బెంగాల్, ఒడిశా, ఝార్ఖండ్‌లకు బదిలీ చేశారు. దీనిని కార్మిక సంఘాలు తప్పుపడుతున్నాయి. ఇప్పుడు మిగిలిన ఉద్యోగులు కూడా తమకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తుంటే...దానిపై చర్చించలేమని పోర్టు ప్రతినిధులు చెబుతున్నారు. ఈ కక్ష సాధింపులు మానేసి, పక్కనే ఉన్న విశాఖపోర్టు మాదిరిగాన్యాయమైనవేతనాలు ఇవ్వాలని వారంతా డిమాండ్ చేస్తున్నారు.

రేషన్ డిపోలు విభజన అస్తవ్యస్తం

... 7వ పేజీ తరువాయి

విధానం తీసుకువచ్చారు. దీని ప్రకారం విశాఖ జిల్లాలో ఒక గోదాము పరిధిలో డిపోలను మరో గోదాము పరిధిలోకి మార్చారు. నగరంలో మర్రిపాలెంలో రెండు గోదాముల నుంచి సర్కిల్-1, 2 పరిధిలో గల డిపోలకు సరకులు సరఫరా చేస్తారు. సర్కిల్-1లో పెందుర్తి నుంచి వన్‌టౌన్ కోటవీధి వరకూ ఉన్న డిపోలకు మర్రిపాలెం ఎంఎల్‌ఎస్ పాయింట్ (గోదాము-1) నుంచి, సర్కిల్-2లో తాటిచెట్లపాలెం నుంచి మధురవాడ వరకూ గల డిపోలకు మర్రిపాలెం ఎంఎల్‌ఎస్ పాయింట్ (గోదాము-2) నుంచి సరకులు పంపిణీ చేస్తున్నారు. అయితే మర్రిపాలెంలో రెండు గోదాముల నుంచి డిపోలకు సరకుల రవాణాకు అయిన ఖర్చు మాత్రం వేర్వేరుగా ఉంది. గోదాము-1 నుంచి రవాణాకు క్వింటాకు రూ.21, గోదాము-2 నుంచి అయితే క్వింటాకు రూ.32 చార్జీగా ఇస్తున్నారు. ఇటువంటి తేడాలు రాష్ట్రంలో అనేకచోట్ల ఉండడంతో రవాణా చార్జీలను సవరించాలని భావించిన అధికారులు జాతీయ స్థాయిలో అమలులో ఉన్న రూట్ ఆప్టిమైజేషన్ విధానం తీసుకువచ్చారు. దీనిప్రకారం సర్కిల్-2లో గల 152 డిపోలలో 69 డిపోలను సర్కిల్-1కు, మరో 25 డిపోలను భీమునిపట్నం కేటాయించారు. దీని ప్రకారం సర్కిల్-2లో ఉన్న డిపోలకు మర్రిపాలెం గోదాము-2కు బదులుగా గోదాము-1, భీమునిపట్నం గోదాముల నుంచి సరకులు అందిస్తారు. అధికారులు తీసుకున్న నిర్ణయంపై డీలర్లు, గోదాము-1 కలాసీలు, సరకులు రవాణా చేసే కాంట్రాక్టర్ అభ్యంతరం చెప్పినా పౌర సరఫరాల సంస్థ అధికారులు పట్టించుకోలేదు. సాధారణంగా ప్రతినెలా ఒకటో తేదీ నుంచి కార్డుదారులకు సరకులు పంపిణీ చేయడానికి పది రోజుల ముందుగానే గోదాము నుంచి డిపోలకు చేరవేయడం మొదలెడతారు. అయితే డిపోల విభజన వల్ల నగరంలో 30 శాతం డిపోలకు ఇంతవరకూ సరకులు అందలేదు. దీంతో వచ్చే నెల ఒకటో తేదీ నుంచి కార్డుదారులకు సరకులు పంపిణీపై అనుమానం వ్యక్తమవుతుంది. తాజాగా అధికారులు తీసుకున్న నిర్ణయం మేరకు మర్రిపాలెం గోదాము-1 కింద 221 డిపోలు, గోదాము-2కు కేవలం 58 డిపోలు అప్పగించారు. దీనిపై కలాసీలు, కాంట్రాక్టర్ అభ్యంతరం వ్యక్తంచేశారు. కాంట్రాక్టరు హైకోర్టులో కేసు వేశారు. ఇంకా డిపోల విభజనపై డీలర్లు అభ్యంతరం వ్యక్తంచేస్తూ కలెక్టర్‌కు ఫిర్యాదు చేయాలని నిర్ణయించారు.

ఐఏఎస్ అధికారికి గ్రేటర్ నజరానా!

... 7వ పేజీ తరువాయి

ఆస్తి పన్ను విధించారు. నిర్మాణం పూర్తయిన తర్వాత ఖాళీగా ఉండిపోవడంతో ఆ భవనాన్ని జీవీఎంసీ అవసరాల కోసం అద్దెకు తీసుకునేలా చూడాలని సదరు ఐఏఎస్ అధికారి...మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్టుమెంట్‌లో చక్రం తిప్పుతున్న సీనియర్ ఐఏఎస్ అధికారి ద్వారా జీవీఎంసీ అధికారికి చెప్పించినట్టు సమాచారం. సీనియర్ ఐఏఎస్ అధికారి చెప్పడమే తరువాయి అన్నట్టు జీవీఎంసీ అధికారి విశాలాక్షినగర్‌లో ఐఏఎస్ అధికారి భార్య పేరిట ఉన్న ఐదంతస్థుల భవనాన్ని నగర పాలక సంస్థ అవసరాల కోసం గెస్ట్‌హౌస్‌గా తీసుకోవాలని నిర్ణయించేశారు. నెలకు రూ.20 లక్షలు అద్దె చెల్లించడంతోపాటు కరెంట్ బిల్లు, అక్కడ పనిచేయడానికి సిబ్బంది నియామకం కూడా జీవీఎంసీయే భరించేలా ఒప్పందం చేసుకున్నట్టు విపక్షాలు ఆరోపిస్తున్నాయి. నిబంధనల ప్రకారం ఏదైనా రెసిడెన్షియల్ భవనాన్ని ప్రభుత్వ శాఖలు అద్దెకు తీసుకోవాలనుకుంటే చదరపు అడుగుకు గరిష్ఠంగా రూ.20 మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది. అంతకుమించి చెల్లించాల్సి వస్తే కౌన్సిల్ నుంచి ప్రత్యేక అనుమతి పొందాల్సి ఉంటుంది. కానీ అవేమీ పాటించకుండా నెలకు రూ.లక్షల్లో అద్దె చెల్లించేందుకు జీవీఎంసీ అధికారి నిర్ణయం తీసేసుకున్నారు. ఇక ఒప్పందం జరిగి నాలుగు నెలలు గడిచినానగరానికి వచ్చిన అతిథి ఒక్కరు కూడా ఆ భవనంలో బసచేసిన దాఖలాలు లేవు. అయినా, విస్కో నుంచి ప్రతి నెలా అద్దె చెల్లింపు మాత్రం జరిగిపోతోంది. ఒకవేళ జీవీఎంసీకి వచ్చిన అతిథులకు స్టార్ హోటల్‌లో వసతి కల్పించినా గెస్ట్‌హౌస్‌కు చెల్లించే అద్దెలో పది శాతానికి మించి ఖర్చయ్యే అవకాశం ఉండదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇదిలావుండగా అధికారులు మాత్రం జీవీఎంసీ పనుల మీద నగరానికి వచ్చే అతిథులు బస చేయాల్సి వస్తే ఒక గెస్ట్‌హౌస్ ఉండాలనే ఉద్దేశంతోనే ఆ భవనాన్ని అద్దెకు తీసుకున్నామని సమర్థించుకుంటున్నారు. అలాగే గెస్ట్‌హౌస్‌కు చెల్లించే అద్దె కూడా రూ.20 లక్షలు కాదని, కేవలం రూ. 2.1 లక్షలు మాత్రమేనని చెబుతున్నారు. కానీ అందుకు సంబంధించిన అధికారిక వివరాలను మాత్రం బయటపెట్టడం లేదు. గెస్ట్‌హౌస్ వ్యవహారాన్ని విపక్ష కార్పొరేటర్లు బయటపెట్టడంతో ఉలిక్కిపడిన జీవీఎంసీ అధికారి జరిగిన తప్పును సరిదిద్దుకోవడంపై దృష్టిపెట్టకుండా, ఆ సమాచారం బయటకు ఎలా వెళ్లిందనే దానిపై నీటి సరఫరా, విస్కో, రెవెన్యూ విభాగం అధికారులను పిలిచి ఆరా తీస్తున్నట్టు తెలిసింది.


కళాకారులను సత్కరిస్తున్న దృశ్యం

ఘనంగా అంతర్జాతీయ నృత్య దినోత్సవం

అగనంపూడి, ఏప్రిల్ 29: జీవీఎంసీ 85వ వార్డు పరిధి కొండయ్యవలస సీడబ్ల్యూసీ ప్రాంగణంలో అంతర్జాతీయ నృత్య దినోత్సవాన్ని సోమవారం స్థానిక అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నృత్య శిక్షణ ఇస్తున్న నంది అవార్డు గ్రహీత జె.సురేశ్‌కుమార్, రాష్ట్ర స్థాయి అవార్డు గ్రహీత విందుల నరసింహనాయుడు, జాతీయ స్థాయి అవార్డు గ్రహీత కె.నాగమణిలను సత్కరించారు. ఈ సందర్భంగా అభివృద్ధి కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ మన సంస్కృతీ సంప్రదాయాలను బావితరాలకు అందించేందుకు కృషి చేస్తున్న కళాకారులను గౌరవించాల్సిన బాధ్యతపై మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో బలిరెడ్డి సత్యనారాయణ, కె.అప్పారావు, కె.హనుమంతరావు, డి.అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ పీవీ సురేశ్‌పై ఫిర్యాదు

మల్కాపురం, ఏప్రిల్ 29: అనుచిత వ్యాఖ్యలు చేస్తూ కార్పొరేటర్ పీవీ సురేశ్ తనను మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ఆయనపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ కనకమహాలక్ష్మి దేవస్థానం డైరెక్టర్ మళ్ల ధనలత మల్కాపురం పోలీసులకు సోమవారం ఉదయం ఫిర్యాదు చేశారు. గతంలో కూడా ఆయనతో ఇబ్బందులకు గురయ్యాయని, తాను ఎన్నికల ప్రచారానికి వెళితే అవమానించేలా సురేశ్ మాట్లాడారని ఫిర్యాదులో ఆమె పేర్కొన్నారు.

అది తప్పుడు ఫిర్యాదు: కార్పొరేటర్ సురేశ్

తనపై మళ్ల ధనలత తప్పుడు ఫిర్యాదు చేశారని కార్పొరేటర్ సురేశ్ తెలిపారు. రెండు రోజుల క్రితం శ్రీహరిపురంలో జరిగిన వైసీపీ ఎన్నికల ప్రచారానికి తాను హాజరయ్యాయని, కాసేపటి తర్వాత ధనలత కూడా వచ్చారన్నారు. అప్పుడు తాను అక్కడి నుంచి వెళ్లిపోయానే తప్ప ఆమెను ఏమీ అనలేదని, అందుకు సాక్షం ఆ రోజు ఉన్నవారేనని పేర్కొన్నారు. దీనిపై పోలీసులు విచారణ జరపాలన్నారు.

టీడీపీ 'టెక్కలి' సమన్వయకర్తగా కాకి గోవిందరెడ్డి


ఎర్రన్నాయుడుతో కాకి గోవిందరెడ్డి

అక్కిరెడ్డిపాలెం, ఏప్రిల్ 29: తెలుగుదేశం పార్టీ టెక్కలి అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తగా 69వ వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు ఎర్రన్నాయుడును ఆయన టెక్కలిలో కలిసి ఎన్నికల వ్యూహంపై చర్చించారు. ఎన్నికల్లో టీడీపీ టెక్కలి అభ్యర్థి గెలుపునకు కృషి చేస్తానని గోవిందరెడ్డి తెలిపారు.

'ఉక్కు'కు సొంత గనులు కేటాయించాలి

కూర్మన్నపాలెం, ఏప్రిల్ 29: స్టీల్‌ప్లాంటుకు ఐదు దశాబ్దాలు గడిచినా సొంత గనులను కేటాయించకపోవడం కేంద్ర ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 1,172వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోరాటాల ద్వారానే ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకుంటామన్నారు. ప్రధాని మోదీ అధికారంలోకి వచ్చాక దేశ ఆర్థిక పరిస్థితి చిన్నాభిన్నమైందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల విక్రయానికి పూనుకున్న కేంద్రానికి తగిన సమయంలో బుద్ధి చెబుతామన్నారు. పలువురు నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **రత్నం:** జగదాంబ, శరత్, శ్రీరామ, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్ (పెందుర్తి), సీతారామయ్య (పరవాడ), రాములమ్మ (తగరపువలస)
- **గీతాంజలి మళ్ళీ వచ్చింది:** శ్రీకన్య, రమాదేవి, ఊర్వశి (కంచరపాలెం) మౌర్య (గోపాలపట్నం), హెవెన్-3 (గోపాలపట్నం), నటరాజ్-2 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
- **ది ఫ్యామిలీ స్టార్:** కామేశ్వరి, శ్రీనరసింహ (గోపాలపట్నం)
- **టిల్లు స్క్వేర్:** మెలోడి, శారద, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), తాతా (తగరపువలస)
- **గాడ్జిల్లా వర్సెస్ కాంగ్:** శ్రీవెంకటేశ్వర, లక్ష్మీకాంత్ (గాజువాక)
- **మంజుమ్మెల్ బోయ్స్:** సంగం, వెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 22, టమాటా 24, వంకాయలు (తెలుపు) 26, వంకాయలు (నలుపు) 16, బెండకాయలు 28, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 34, బీరకాయలు 40, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 30, క్యాబేజ్ 22, క్యారెట్ 36, దొండకాయలు 28, బంగాళా దుంపలు 28, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 34, అల్లం (పాతది) 150, బరబటి 30, ముల్లంగి 42, నిమ్మకాయలు (కిలో) 105, గోరుచిక్కుడు 28, దోసకాయలు 24, వెల్లుల్లి (పెద్దవి) 190, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 84, పొటల్స్ 48, కీరదోస 28, క్యాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 34, చిలగడదుంపలు 36, కంద 60, దేముడుచిక్కుడు 60, కొండఉసిరి 90, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట)5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 28, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 38, జామకాయలు (కిలో) 40.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	400
విజయనగరం	404
శ్రీకాకుళం	404

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	120
ఫారం ధర	--	140
విత్ స్కిన్	--	250
స్కిన్‌లెస్	--	260

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..

ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు వీరే..

నామినేషన్ల ఉపసంహరణ తర్వాత గాజువాక అసెంబ్లీ నియోజకవర్గంలో 14 మంది » 'పెందుర్తి'లో 14.. » 'పశ్చిమ'లో 13 మంది..

గాజువాక, ఏప్రిల్ 29: ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ అనంతరం గాజువాక అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో 14 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. మొత్తం 21 మంది అభ్యర్థులు 32 నామినేషన్లు చేయగా, వీరిలో ఐదుగురికి సంబంధించిన ఆరు సెట్ల నామినేషన్లను ఎన్నికల అధికారి తిరస్కరించారు. సోమవారం పి.శ్రీనివాసరావు (జాతీయ జనసేన పార్టీ), గవర రోహిణి (స్వతంత్ర) తమ నామినేషన్లను ఉపసంహరించుకోవడంతో మొత్తం 14 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. వీరిలో పల్లా శ్రీనివాసరావు (తెలుగుదేశం), గుడివాడ అమర్‌నాథ్ (వైసీపీ), మరడాన జగ్గునాయుడు (సీపీఎం), కేఏ పాల్ (ప్రజా శాంతి పార్టీ), ఎన్.అప్పారావు (బీఎస్పీ), టి.అక్కయ్య (లోకతంత్రిక్ జనతాదళ్), శ్యాముల్ జాన్ ధర్మరాజు రాయపాటి (దళిత బహుజన), తలపుల శైలజ (ప్రజాప్రస్థానం), కాండ్రేగుల ఆదినారాయణ (జై మహాభారత్), బత్తుల నీలకంఠం (నవభారత్ నిర్మాణ సేవ), సుంకర సారజ్యోతి (నవతరం పార్టీ), సిమకుర్తి శ్రీనివాసరావు (స్వతంత్ర), కొవిరి కృష్ణ (స్వతంత్ర), కాకర్లమూడి కృష్ణప్రదీప్ (స్వతంత్ర). ఉన్నారు.

'పెందుర్తి' పోటీలో 14 మంది..

పెందుర్తి: పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి ఐదుగురు నామినేషన్లు ఉపసంహరించుకోవడంతో 14 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు.


'పశ్చిమ' అభ్యర్థులతో మాట్లాడుతున్న ఈఆర్వో హుస్సేన్ సాహెబ్

ఇక్కడ 20 మంది అభ్యర్థులు 33 నామినేషన్లు వేయగా ఉపసంహరణ తర్వాత 14 మంది పోటీలో ఉన్నారు. నామినేషన్లను ఉపసంహరించుకున్న వారిలో జనసేన పార్టీకి చెందిన పంచకర్ల మహాలక్ష్మి, పంచకర్ల వెంకటేశ్వరరావు, స్వతంత్ర అభ్యర్థులు షేక్ షఫీ ఉల్లా, గుంటూరు సాయిప్రియ, బంటికోరు గోవిందరాజు ఉన్నారు. కాగా పోటీలో అన్నంరెడ్డి అదీప్‌రాజ్ (వైసీపీ), పంచకర్ల రమేశ్‌బాబు (జనసేన), బంగారి రమణ (బీఎస్పీ), పిరిడి భగత్ (కాంగ్రెస్), ఈత రోజా (పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా), ఏలూరు వెంకటరమణ (నేషనలిస్ట్ జనశక్తి), కన్నేపల్లి మహదేవ్ (జైభారత్ నేషనల్ పార్టీ), పి.రమేశ్‌నాయుడు (నవరంగ్ కాంగ్రెస్), బోలెం వెంకట మురళీమోహన్ (సమాజ్‌వాద్), ఆడారి నాగరాజు (స్వతంత్ర), కూండ్రపు సన్యాసిరావు (స్వతంత్ర), గుంటూరు వెంకట నరసింహరావు (స్వతంత్ర), పొన్నాడ అప్పలనాయుడు (స్వతంత్ర), వడ్డాది ఉదయ్‌కుమార్ (స్వతంత్ర) ఉన్నారు.

'పశ్చిమ'లో 13 మంది..

జ్ఞానాపురం: పశ్చిమ అసెంబ్లీ నియోజకవర్గం బరిలో 13 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. 16 మంది నానినేషన్లను ఆమోదించగా సోమవారం ముగ్గురు ఉపసంహరించుకోవడంతో 13 మంది బరిలో నిలిచినట్టు ఈఆర్వో ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ తెలిపారు. పోటీలో ఉన్న వారిలో పీవీజీఆర్ నాయుడు (గణబాబు-టీడీపీ), ఆడారి ఆనంద్‌కుమార్ (వైసీపీ), అతుకుం శెట్టి రామచంద్రరావు (బీఎస్పీ), అత్తిలి విమల (సీపీఐ), బొట్టా కోటేశ్వరరావు (భారత చైతన్య యువజన పార్టీ), వెంకటగణేశ్ జగ్గుమంత్రి (జై భారత్ నేషనల్ పార్టీ) రవికుమార్ వెలగాడ (సమాజ్‌వాద్)చ మండపాటి శ్రీనివాసరాజు (జాతీయ జనసేన పార్టీ), స్వతంత్రులుగా హనుమంతు శివ చాణక్య దొర, జామి పార్వతి, కొయిలాడ వెంకటవర జగదీశ్, వింజుమూరి కిరణ్ కుమార్, పెదిరెడ్ల నానాజీ ఉన్నారన్నారు. ఈ సందర్భంగా అభ్యర్థులతో ఈఆర్వో సమావేశమై ఎన్నికల ప్రచారం ముగిసేంత వరకు పాటించాల్సిన నిబంధనల గురించి వివరించారు. ఓటర్లను ఏ విధంగా ప్రలోభపెట్టినా ఎన్నికల సంఘం నియమావళి ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అనంతరం అభ్యర్థులకు గుర్తులు కేటాయించారు.


60వ వార్డులో ప్రజలతో మాట్లాడుతున్న గణబాబు


92వ వార్డులో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న గణబాబు

ఐదేళ్ల వైసీపీ పాలన మోసపూరితం

తెలుగుదేశం పార్టీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి పి.గణబాబు

మల్కాపురం, ఏప్రిల్ 29: రాష్ట్రంలో ఐదేళ్లపాటు వైసీపీ ప్రభుత్వ పాలన మోసపూరితంగా సాగిందని తెలుగుదేశం పార్టీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి, ఎమ్మెల్యే పి.గణబాబు మండిపడ్డారు. సోమవారం ఆయన 60వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి విజయం రాష్ట్రానికి ఎంతో అవసరమన్న విషయాన్ని ప్రజలంతా గుర్తించాలన్నారు. వైసీపీ అరాచకాలను కూటమి నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకువెళ్లడంతో పాటు తమ మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరించాలని కోరారు. టీడీపీ హయాంలో నాడు రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందగా, వైసీపీ హయాంలో ఇరవై ఏళ్ల వెనక్కి పోయిందని విమర్శించారు. నిరుద్యోగులు కూడా టీడీపీ పాలనపై ఎన్నో ఆశలు పెంచుకున్నారన్నారు. నియోజకవర్గంలోని అనేక సమస్యలను తాను పరిష్కరించానని, భవిష్యత్తులో మరిన్ని సమస్యలను పరిష్కరిస్తానన్నారు.

రాష్ట్రాన్ని అభివృద్ధిలో పరుగులు పెట్టించే సత్తా చంద్రబాబుకు మాత్రమే ఉందన్నారు. ప్రజలంతా తమ పిల్లల భవిష్యత్తును, రాష్ట్ర శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని ఎమ్మెల్యేగా తనను, విశాఖ ఎంపీ అభ్యర్థిగా ఎం.శ్రీభరత్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని గణబాబు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాతా శ్రీను, నక్కా లక్ష్మణరావు, బుద్ధ త్రినాథ్, కె.శంకర్, తదితరులు పాల్గొన్నారు.

కూటమి విజయంతోనే రాష్ట్రాభివృద్ధి

గోపాలపట్నం: కూటమి అభ్యర్థుల విజయంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని తెలుగుదేశం పార్టీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి, ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు. 56వ వార్డు పరిధి దయానందనగర్, చాకలిగెడ్డ ప్రాంతాలకు చెందిన పలువురు టీడీపీ జిల్లా ఎస్టీ మోర్చా అధ్యక్షుడు నాగయ్య ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను ఆయన నివాసంలో సోమవారం ఉదయం కలిసి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రం అన్ని రంగాలలో వెనకబడిపోయిందన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో కూటమి అధికారంలోకి వస్తేనే రాష్ట్ర ప్రజలకు మేలు జరుగుతుందని, అందువల్ల ప్రతిఒక్కరూ తమ గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. తాను నిత్యం నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండేవాడినని, అందువల్ల తనను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో 56వ వార్డు కార్పొరేటర్ శరగడం రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఆనంద్‌కుమార్‌ను అధిక మెజారిటీతో గెలిపించండి

వైసీపీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి 'ఆడారి' సతీమణి మాలతి

గోపాలపట్నం, ఏప్రిల్ 29: త్వరలో జరగనున్న ఎన్నికల్లో వైసీపీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తన భర్త ఆడారి ఆనంద్‌కుమార్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించవలసిందిగా ఆయన సతీమణి ఆడారి మాలతి విజ్ఞప్తి చేశారు. 92వ వార్డు పరిధి పద్మనాభనగర్ పరిసర ప్రాంతాల్లో సోమవారం ఆమె ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గ సమన్వయకర్తగా ఆనంద్‌కుమార్ చేసిన అభివృద్ధి పనులను వివరించడంతో పాటు ఒక్కసారి చాన్స్ ఇచ్చి ఎమ్మెల్యేగా ఆయనను గెలిపిస్తే 'పశ్చిమ'ను ఆదర్శవంతంగా తీరుదిద్దుతారన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ కొనసాగాలంటే వైసీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ మేనిఫెస్టో కరపత్రాలను ఓటర్లకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బెహరా భాస్కరరావు, అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసీపీలో చేరిన టీడీపీ కార్యకర్తలు

ఎన్.ఎ.డి.జంక్షన్: జీవీఎంసీ 89వ వార్డు పరిధిలోని ఖారవేలనగర్, కొత్తపాలెం, సూర్యానగర్, చంద్రంపాలెం ప్రాంతాలకు చెందిన పలువురు టీడీపీ కార్యకర్తలు సోమవారం వైసీపీలో మర్రిపాలెం వుడా కాలనీలో ఉన్న వైసీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వైసీపీలో చేరిన వారికి పార్టీ కండువాలు వేసి ఆ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ సతీమణి మాలతి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆనంద్‌కుమార్‌ను గెలిపిస్తే నియోజకవర్గంలోని అన్ని సమస్యలను పరిష్కరిస్తారన్నారు. వైసీపీ సమన్వయకర్తగా ఉన్నప్పుడే ఆయన 'పశ్చిమ'లో ఎన్నో అభివృద్ధి పనులు చేసిన విషయాన్ని ప్రజలంతా గుర్తించి ఆయనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. జగన్ మేనిఫెస్టోను నాయకులు, కార్యకర్తలు ప్రజలకు వివరించి వైసీపీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు పేడాడ రమణికుమారి, మాజీ కార్పొరేటర్ బెహరా భాస్కరరావు, నాయకులు మురళీకృష్ణ, గోపి, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.


92వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్ సతీమణి మాలతి


ఆడారి మాలతి సమక్షంలో వైసీపీలో చేరిన టీడీపీ కార్యకర్తలు

వైభవంగా పెంటమాంబ పండుగ

పెదగంట్యాడ, ఏప్రిల్ 29: నెల్లిముక్కు పంచాయతీ పరిధిలోని 14 గ్రామాల ప్రజల ఇలవేల్పు పెంటమాంబ పండుగను సోమవారం వైభవంగా నిర్వహించారు. వేకువజాము నుంచే సమయం నుంచే అమ్మవారిని దర్శించేందుకు వందలాది భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాల్లో సందడి వాతావరణం నెలకొంది. గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, ఆలయ కమిటీ డైరెక్టర్లు అమ్మవారి తొలి పూజలో పాల్గొన్నారు. పెంటమాంబ ఆలయానికి అనుబంధంగా ఉన్న కుంచుమాంబ, దుర్గాలమ్మ, మరిడిమాంబ, శక్తి మాత, పోలమాంబ అమ్మవార్లను భక్తులు దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు హోమాలు జరిపారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ ప్రతినిధులు టెంట్లు, చలువపందిళ్లు, తాగునీరు, మజ్జిగలను ఏర్పాటు చేశారు. సాయంత్రం అమ్మవారిని బండ్ల వేషాలు, సాముగారిడీలు, పులివేషాలు, కోయ డ్యాన్స్, గరగ నృత్యం, తప్పెటగుళ్లు, తదితర సాంస్కృతిక ప్రదర్శనల నడుమ ఊరేగించారు. పెద్దఎత్తున బాణసంచా కాల్చారు. రాత్రి ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. న్యూపోర్టు పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేశారు.


పెంటమాంబ అమ్మవారిని దర్శించుకునేందుకు క్యూలో వేచివున్న భక్తులు

ఉక్కు రిలే నిరాహార దీక్షల కార్యాచరణ

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 29: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న రిలే నిరాహారదీక్షల ఉద్యమ కార్యాచరణను ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు సోమవారం ప్రకటించారు. ఇందులో భాగంగా మే ఒకటిన ఎల్ఎంఎంఎం, ఎస్‌బీఎం, రెండున డబ్ల్యూఎండీ, యుటిలిటీస్, ఏడీఎం, టీపీ, టీటీఐ, మూడున డబ్ల్యూఆర్ఎం, నాలుగున ఎంఎంఎస్ఎం, ఎస్‌టీఎం, ఐదున కాంట్రాక్టు కార్మికులు, ఆరున ఎస్ఎంఎస్-1, ఏడున సీఎంఎం, సీఆర్ఎంపీ, సీఎంఈ, సీఈడీ, ల్యాబ్ అండ్ హైడ్రా, ఎనిమిదిన కోక్ ఓవెన్, తొమ్మిదిన సింటర్ ప్లాంట్, పదిన బ్లాస్ట్‌ఫర్నేస్ ఉద్యోగులు, కార్మికులు దీక్షల్లో కూర్చుంటారు. అలాగే 11న ఎస్ఎంఎస్-2, 12న కాంట్రాక్టు కార్మికులు (ఇంటక్), 13న ఎల్ఎంఎం, ఎస్‌బీఎం, 14న ట్రాఫిక్, కనస్ట్రక్షన్స్, ఆర్ఎండీ, 15న ఓబీసీ అసోసియేషన్, 16న ఎంఎంఎస్ఎం, ఎస్‌టీఎం, 17న ఇన్‌స్ట్రుమెంటేషన్, క్యూఏటీడీ, ఆర్అండ్‌డీ, టెలికాం, ఈటీఎల్, డీఎన్‌డబ్ల్యూ, 18న ఈఎస్ఎఫ్, ఈఎండీ, ఈఆర్ఎస్, సేఫ్టీ, భద్రత, టెక్‌సెల్, ఎస్ఎస్‌డీ, ఆగ్రో, 19న ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్, 20న ఎస్ఎంఎస్-1 ఉద్యోగులు, కార్మికులు దీక్షల్లో పాల్గొంటారు. అదేవిధంగా 21వ తేదీన ఎఫ్ఎండీ, ఆర్ఎస్అండ్ఆర్ఎస్, ప్లాంట్ డిజైన్, సీఎంఈ, వీఎస్‌జీహెచ్, 22న టీపీపీ, ఆర్ఈడీ, పీఈఎం, స్టోర్స్ ఆర్ఈడీ, 23న సింటర్ ప్లాంట్, 24న కోక్‌ఓవెన్, 25న బ్లాస్ట్‌ఫర్నేస్, 26న కాంట్రాక్టు కార్మికులు (సీఐటీయూ), 27న ఆర్ఎంహెచ్‌పీ, ఏసీఎస్, హెచ్ఆర్, 28న ట్రాఫిక్, కనస్ట్రక్షన్స్ ఆర్ఎండీ, 29న ఎస్ఎంఎస్-2, 30న ఇన్‌స్ట్రుమెంటేషన్, క్యూఏటీడీ, ఆర్అండ్‌డీ, టెలికాం, 31న ఈఎస్అండ్ఎఫ్, ఎఫ్ఎండీ, ఈఆర్ఎస్, భద్రత, టెలికాం విభాగాల ఉద్యోగులు రిలే నిరాహార దీక్షల్లో కూర్చుంటారని పేర్కొన్నారు.


చార్జిషీట్ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న పల్లా శ్రీనివాసరావు, తదితరులు

జగనాసుర రక్తచరిత్రకు చరమగీతం పాడదాం

టీడీపీ గాజువాక నియోజకవర్గ అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు

గాజువాక, ఆగస్టు 29: రాష్ట్రంలో జగనాసుర రక్తచరిత్రకు చరమగీతం పాడాల్సిన సమయం ఆసన్నమైందని తెలుగుదేశం పార్టీ గాజువాక అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు అన్నారు. ఇక్కడి పార్టీ కార్యాలయంలో సోమవారం రాష్ట్ర ప్రభుత్వ అక్రమాలకు సంబంధించి రూపొందించిన చార్జిషీట్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశాంతమైన ఆంధ్రప్రదేశ్‌ను గంజాయి, అరాచక పాలనకు బ్రాండ్ అంబాసిడర్ మార్చిన ఘనత జగన్‌కు దక్కుతుందని విమర్శించారు. అంబేద్కర్ రాజ్యాంగానికి బదులు తన తాత రాజారెడ్డి రాజ్యాంగాన్ని జగన్ అమలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రశ్నించే వారిపై వేధింపులు, దాడులు, కొన్ని సందర్భాల్లో హత్యలు కూడా జరిపాలని ఆరోపించారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, కార్పొరేటర్లు పల్లా శ్రీనివాస్, గంధం శ్రీనివాస్, బొండా జగన్, రౌతు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.


పల్లా శ్రీనివాసరావుతో మటన్ దుకాణాల యజమానులు

టీడీపీకి మటన్ దుకాణ యజమానుల మద్దతు

పల్లా శ్రీనివాసరావుకు గాజువాక ప్రాంత మటన్ దుకాణాల యజమానులు మద్దతు తెలిపారు. ప్రస్తుతం వ్యాపారం చేయాలంటే వైసీపీ నాయకుల అనుమతి పొందాల్సి వస్తుందని, దీంతో తాము ఇబ్బందులు పడుతున్నామని పలువురు వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు. గాజువాకలో మోడరన్ కబేళాను ఏర్పాటు చేయడంతో పాటు టీడీపీ అండగా ఉంటుందని పల్లా హామీ ఇచ్చారు. షేక్ ఖాదర్ బాషా, రవి, రమణ, మదీనా, రెహమాన్, రామసూరి, తదితరులు పాల్గొన్నారు.

కాపుల ఆకాంక్షలను నెరవేరుస్తాం: ఎంపీ అభ్యర్థి శ్రీభరత్

కూర్మన్నపాలెం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కాపుల ఆకాంక్షలను నెరవేరుస్తామని టీడీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి ఎం.శ్రీభరత్ అన్నారు. వైజాగ్ ప్రొఫైల్స్ గ్రీన్‌సిటీలో ఆదివారం రాత్రి జరిగిన కేటీబీ కుటుంబ సభ్యుల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశానికి కేటీబీ మహిళలు అధిక సంఖ్యలో హాజరవ్వడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. గాజువాక అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక గాజువాకలోని దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, నాయకులు, పాల్గొన్నారు.


ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న పంచకర్ల రమేశ్‌బాబు

రాష్ట్ర భవిష్యత్తు కోసం కూటమి అభ్యర్థులను గెలిపించండి

పెందుర్తి నియోజకవర్గ అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు

వేపగుంట, ఏప్రిల్ 29: రాష్ట్ర భవిష్యత్తు కోసం కూటమి అభ్యర్థులను గెలిపించవలసిందిగా జనసేన పార్టీ పెందుర్తి నియోజకవర్గ అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు కోరారు. 93వ వార్డు పరిధిలోని టీడీపీ జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశం కార్పొరేటర్ రాపర్తి కన్నా ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఎస్ఎన్ఆర్ కల్యాణ మండపంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని సమస్యలపై తనకు పూర్తి అవగాహన ఉందని, తనను గెలిపిస్తే వాటి పరిష్కారానికి చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు. సీఎం జగన్ అరాచక పాలనతో రాష్ట్రం ఇరవై ఏళ్ల వెనక్కి పోయిందని, ఏపీ గాడిలో పడాలంటే మళ్లీ చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం చారిత్రక అవసరమన్నారు. అనంతరం పంచకర్ల 94వ వార్డు ఆర్ఆర్‌వీపురం, వెంకటసాయినగర్‌లో ప్రచారం సాగించారు. ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని కూటమి అభ్యర్థులను గెలింపించాలని ప్రజలను కోరారు. టీడీపీ పెందుర్తి ఇన్‌చార్జి గండి బాబ్జీ, కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు, నాయకులు పి.పార్వతి, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చేసి చూపిస్తా: బీజేపీ అనకాపల్లి అభ్యర్థి సీఎం రమేశ్


రోడ్ షోలో సీఎం రమేశ్, పంచకర్ల, తదితరులు

తనను గెలిపిస్తే జాతీయ స్థాయిలో ఉన్న పరిచయాలతో అనకాపల్లి, పెందుర్తి విలీన ప్రాంతాలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి చూపిస్తానని బీజేపీ అనకాపల్లి అభ్యర్థి సీఎం రమేశ్ అన్నారు. 94వ వార్డు పరిధిలోని కృష్ణరాయపురం బీఆర్‌టీఎస్ రోడ్డులో పంచకర్లతో కలిసి రోడ్ షో నిర్వహించగా వారికి కూటమి నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన సేనాతివానిపాలెంలోని షిర్డీ సాయి ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలంతా తమ పిల్లల బంగారు భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. నాయకులు గండి బాబ్జీ, సీఎం రమేశ్ సోదరుడు శ్రీనివాస నాయుడు, కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

పంచకర్ల సతీమణి ప్రచారం

పెందుర్తి: జనసేన పార్టీ 'పెందుర్తి' అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు సతీమణి మండలంలోని రాంపురం, పినగాడిలో ప్రచారం చేశారు. ఇరు గ్రామాల్లోని ఉపాధి హామీ పథక పనులు చేస్తున్న మహిళా కూలీలతో సమావేశమయ్యారు. కూటమి ప్రభుత్వం ఏర్పడితే ఉపాధి కూలీల వేతనం పెంపునకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎంపీపీ వరలక్ష్మి, కన్నబాబు, హరగోపాల్ పాల్గొన్నారు.

'ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించండి'

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 29: స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం ఇండియా కూటమి అభ్యర్థిని గెలిపించవలసిందిగా సీఐటీయూ ఉక్కు గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరాం పిలుపునిచ్చారు. ఉక్కు సీఐటీయూ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పనిచేయాలని, ఇండియా కూటమి విజయంతోనే ప్లాంట్ అభివృద్ధి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఇండియా కూటమి గాజువాక అభ్యర్థి ఎం.జగ్గునాయుడు, విశాఖ, అనకాపల్లి ఎంపీ అభ్యర్థులు పి.సత్యారెడ్డి, వేగి వెంకటేశ్, పెందుర్తి అసెంబ్లీ అభ్యర్థి భగత్, ఉక్కు కార్మిక సంఘ నాయకులు పాల్గొన్నారు.

మల్కాపురం: ఇండియా కూటమి వల్లే మన దేశానికి, రాష్ట్రానికి మేలు జరుగుతుందని.. అందువల్ల కూటమి అభ్యర్థులను గెలిపించవలసిందిగా మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు కోరారు. మల్కాపురంలో సోమవారం సాయంత్రం జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను ఎంతగానో మోసం చేశాయన్నారు. నిత్యావసర సరకుల ధరల పెరుగుదలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా పీఎం, సీఎంలు పట్టించుకోవడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు విజయారావు, జీవీ రంగారావు, సీతామహాలక్ష్మి, బండ్ల శ్రీనివాసరావు, రాంబాబు, సత్యాంజనేయ, తదితరులు పాల్గొన్నారు.

'ఉత్తరం'లో 15 మంది.. 'దక్షిణం'లో 16 మంది

» రెండు నియోజకవర్గాల్లో నామినేషన్ల ఉపసంహరణ అనంతరం పోటీలో మిగిలిన అభ్యర్థులు

సీతమ్మధార, ఏప్రిల్ 29: ఉత్తర నియోజకవర్గంలో 15 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచినట్టు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అఖిల తెలిపారు. సోమవారం నామినేషన్ల ఉపసంహరణ ముగిసింది. తొలుత 24 మంది అ భ్యర్థులు నామినేషన్ పత్రాలను సమర్పించగా, అందు లో స్క్రూటినీ అనంతరం 17 మంది దరఖాస్తులను ఆమోదించినట్టు ఆర్వో తెలిపారు. ఇందులో ఇండిపెండెంట్‌గా దరఖాస్తులు చేసిన సుమ కమ్మిల, చెంచల మల్లికార్జునరావు తమ నామినేషన్లను విత్‌డ్రా చేసుకున్నారు. ఇప్పుడు బరిలో కన్నపురాజు కమ్మిల (కేకే రాజు వైసీపీ), పెద్దడ కనకమహాలక్ష్మి (బీఎస్పీ), లక్కరాజు రామారావు (ఐఎన్ఎస్ కాంగ్రెస్ పార్టీ), పెనుమత్స విష్ణుకుమార్ రాజు (బీజేపీ), గుంపుల శరత్‌బాబు (సమాజ్‌వాది పార్టీ), చింతాడ సూర్యం (నభ భారత్ నిర్మాణ సేవ పార్టీ), పి.జగదీష్ (జాతీయ జనసేన పార్టీ), వీవీ లక్ష్మీ నారాయణ జైభారత్ నేషనల్ పార్టీ, కోనేటి ఈశ్వర వీరదభద్రచారి, సప్ప రామునాయుడు, బొడ్డు శ్రీనివాస్, బొ ర రమేష్ , ఎలమంచిలి సాహితి , రేణంకి చలపతి రావు, వడ్డీ శిరిషలు ఇండిపెండెంట్ అభ్యర్థులుగా పోటీలో నిలిచినట్టు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, తహసీల్దార్ శ్రీరామమూర్తి వివరించారు.

దక్షిణ నియోజకవర్గం బరిలో..

మహారాణిపేట: దక్షిణ నియోజకవర్గ బరిలో 16మంది నిలిచారు. నామినేషన్ వేసిన 19 మందిలో సోమవారం ముగ్గురు ఉపసంహరించుకున్నారు. వారిలో బి రోహిత్‌కుమార్, మోయ స్వామిబాబు, చెన్ను బోయిన పద్మజ ఉన్నట్టు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి తెలిపారు. దీంతో బరిలో మొత్తం 16 మంది పోటీలో మిగిలారు. వీరిలో జనసేన అభ్యర్థిగా వంశీకృష్ణ శ్రీనివాస్, వైసీపీ అభ్యర్థిగా వాసుపల్లి గణేష్‌కుమార్ , కదిరి రాము బహుజన్ సమాజ్ పార్టీ, కాం గ్రెస్ అభ్యరిగా వాసుపల్లి సంతోష్ కుమార్, జై మహా భారత్ పార్టీ తరపున కుంబేటి శ్రీదేవి, భారతీయ రాష్ట్రీయ దళ్ అభ్యర్థిగా దుర్గా ప్రసాద్ గునులు, ప్రజా ప్రస్థానం అభ్యర్థిగా బూర శ్రీనివాసరావు, యర్రం శెట్టి సురేష్ కుమార్... జై భారత్ నేషనల్ పార్టీ, రావాడ తాతారావు.. నవ భారత నిర్మాణసేవా పార్టీ, బుద్దవరపు వంశీకీర్తి కుమార్..జాతీయజనసేన పార్టీ, సూరాడ ఎల్లాజీ సమాజ్‌వాది పార్టీ, కడగల ఈశ్వరరావు, కిలపర్తి మంగ రత్నం, డోలా జగదీష్, లోగిశెట్టి తారక రామ్, జే బిఫిన్ కుమార్ జైన్ ఇండిపెండెంట్ అభ్యర్థులుగా నిలిచారు. వీరిలో జే బిఫిన్ కుమార్ జైన్ వైసీపీ 31వ వార్డు కార్పొరేటర్ వ్యవహరిస్తున్నారు. ఎన్నికలలో అత ను ఆపార్టీ రెబెల్‌గా పోటీ చేయడం గమనార్హం.

ప్రచార ఖర్చును పరిశీలకులకు అందించాలి...

సీతమ్మధార: ఎన్నికల్లో అభ్యర్థుల ప్రచార ఖర్చు వివరాలను మూడు విడతుల్లో పరిశీలకునికి తెలపాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి డి.అఖిల తెలిపారు. మొదటి విడతగా మే1వ తేదీన, రెండో విడతగా మే 6న, మూడో విడతగా మే 11న ఎన్నికల వ్యయంను



వివరాలు వెల్లడిస్తున్న ఉత్తర నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి అఖిల

తనిఖీ చేయించుకోవాలని తెలిపారు. పోటీలో ఉన్న అభ్యర్థులు, ఏజెంట్లు వారు నామినేషన్ వేసిన తేదీ నుంచి ఏప్రిల్ 30 వరకు వారికి ఇచ్చిన అకౌంట్ రిజిస్టర్లలో నమోదు చేసి సంబంధిత రసీదులు, ఓచర్లు, బ్యాంక్ పాస్ పుస్తకంతో వెళ్లి మే1వ తేదీన ఆథరైజ్డ్ ఏజెంట్ జోనల్ కమిషన్ వారి కార్యాలయం జ్ఞానాపురంలో తనిఖీ చేయించుకోవాలని తెలిపారు.

రైతుబజారులో తూనికల శాఖాధికారులు తనిఖీలు



రైతులకు సూచలను చేస్తున్న అధికారులు

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 29 : గ్రేటర్ 45వ వార్డు నరసింహనగర్ రైతుబజారులో తూనికలు, కొలతల శాఖ అధికారులు సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. జిల్లా కంట్రోలర్ కేటీ రవికుమార్, అసిస్టెంట్ కంట్రోలర్ పీడీవీ అప్పలరాజు, వెయింగ్ ఇన్‌స్పెక్టర్ వి.రామారావు వినియోగదారులు తీసుకునే కూరగాయలు తగిన బరువు ఉందా? లేదా అలాగే రైస్ బ్యాగులను తనిఖీ చేశారు. రైతులు, డ్వాక్రా గ్రూపులు, కిరాణా దుకాణాల వారి కాటాలను పరిశీలించి గడువులోగా కాటాలకు సీలు వేయించుకోవాలని సూచించారు. రైతుబజారు ఎస్టేట్ అధికారి పి. చిన్నబాబు, సహాయకుడు ఆర్. సత్యనారాయణ ఉన్నారు.

నిరుద్యోగ సమస్యను పరిష్కరిస్తా..

జై భారత్ పార్టీ అధ్యక్షుడు వి.వి.లక్ష్మీనారాయణ




ఓటర్లకు అభివాదం చేస్తున్న లక్ష్మీనారాయణ

మాధవధార, ఏప్రిల్ 29; ప్రజల మద్దతుతో తనను ఆంధ్రప్రదేశ్ శాసనసభకు పంపితే నిరుద్యోగ సమస్య పరిష్కారానికి పోరాడతానని జై భారత్ పార్టీ అధ్యక్షులు వి.వి.లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం మురళీనగర్ ప్రాంతాల్లోని నివాసిత కాలనీల్లో ప్రచారం చేశారు. పార్టీ మేనిఫెస్టోని ప్రజలకు వివరించారు. డ్రగ్స్, గంజాయి, మత్తు పదార్థాల రవాణాని అరికట్టే విధంగా చర్యలు తీసుకుంటానని ప్రజలకు హామీ ఇచ్చారు. స్టీల్ ప్లాంట్ రక్షణకు నిర్మాణాత్మక పోరాటం చేస్తున్న తనకు, పార్టీ అభ్యర్థులను ప్రజలు మద్దతిచ్చి ఎన్నికల్లో ఓటేసి గెలిపించాలన్నారు. ప్రచారంలో పార్టీ నాయకులు, మద్దతుదారులు ఉన్నారు.

షిర్డీ సాయి ఆలయ వార్షికోత్సవం

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 29: సౌత్ షిర్డీ సాయిబాబా ఆలయ 26వ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. మందిర్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో అర్చకులు సాయినాథునికి ప్రత్యేక పూజలను నిర్వహించారు.శ్రీ గీతా ప్రచార సమితి ఆధ్వర్యంలో సంపూర్ణ గీతా పారాయణం నిర్వహించారు. ఆలయ అధ్యక్షులు జి.నూకేశ్వరరావు, కార్యదర్శి సీహెచ్ కృష్ణమూర్తి, ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్, సీహెచ్‌వీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



అలంకరణలో షిర్డీసాయి

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అక్కయ్యపాలెం: నిర్వహణ పనులు చేపడుతున్నందున తాటిచెట్లపాలెం సెక్షన్ 11 పరిధిలో మంగళవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ వీవీ మహేశ్వర రెడ్డి తెలిపారు. ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్ ఏరియా, సాయిబాబా ఆలయం నుంచి ఎనభై అడుగుల రోడ్డు వరకు ఉన్న ప్రాంతాలు, పాత పోస్టాఫీసు రోడ్డు ఏరియా, మహారాణి పార్లర్ ఏరియాల్లో కరెంట్ సరఫరా ఉండదు.



గ్రేటర్ 37 వార్డులో సినీనటుడు పృథ్వీతో కలసి వంశీకృష్ణ ప్రచారం



జనసేనలో చేరిన మత్స్యకారులు

దోపిడీకి కేరాఫ్‌గా జగన్ పాలన

» సినీ నటుడు పృథ్వీ » దక్షిణ నియోజకవర్గంలో విస్తృత ప్రచారం

జగదాంబ కూడలి, ఏప్రిల్ 29: ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ రా ష్ట్రాన్ని దోపిడీ చేశారని జనసేన నాయకుడు, సినీనటుడు పృథ్వీ అన్నారు. సోమవారం గ్రేటర్ 37వ వార్డు పరిధిలో గొల్లవీధి వద్ద జరిగిన ఎన్నికల ప్రచార సభలో దక్షిణం జనసేన అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్‌తో కలసి మాట్లాడారు. జగన్ అండ్ కో దోచుకొని, దాచుకోవడం తప్ప ప్రజలకు చేసేందేమీలేదన్నారు. వైసీపీ జగన్ పాలనలో అన్ని వర్గాల ప్రజానీకం ఇబ్బందికి లోనయ్యారని విమర్శించారు. జగన్ మాయమాటలకు మోసపోవద్దంటూ మహిళలను హెచ్చరించారు. ఏపీలో కూటమి అధికారంలోకి వస్తేనే భవిష్యత్తు ఉంటుందని అన్నారు. దక్షిణంలో ప్రస్తుత ఎమ్మెల్యే వాసుపల్లిని ఇంటికి పంపాలన్నారు. కూటమి అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్, ఎంపీ అభ్యర్థి శ్రీభరత్‌లను గెలిపించాలని ప్రజలను కోరారు. భజనకోవెల, యాత వీధి, బ్రహ్మంగారివీధి, స్కీం బిల్డింగ్ ప్రాం తాల్లో ఈ ప్రచారం సాగింది. మూడు శ్రేణులు పాల్గొన్నాయి. రాత్రి పూర్ణామార్కెట్ వద్ద ప్రచారం చేశారు.

జనసేన పార్టీలో మత్స్యకారులు చేరిక

మహారాణిపేట: ఫిషింగ్ హార్బర్‌కు చెందిన పలువురు మత్స్యకారులు జనసేన పార్టీలోకి చేరారు. సోమవారం శ్రీ గంగాభవానీ ఫిషింగ్ హార్బర్ చేపల వేలందారులు సంక్షేమ సంఘం కార్యవర్గ సభ్యులతోపాటు పలు మత్స్యకారులు వంశీకృష్ణ శ్రీనివాస్ వారికి కండువాలువేసి పార్టీలోకి ఆహ్వానించారు. మత్స్యకారులు గుంటు నూకరాజు, మూగి రాజ్‌కుమార్, జోగి సుధాకర్, దుంప ఈశ్వర్ పాల్గొన్నారు.

వంశీకృష్ణ సతీమణి ప్రచారం

డాబాగార్డెన్స్/ అల్లిపురం: వంశీకృష్ణ శ్రీనివాస్‌యాదవ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వంశీకృష్ణ సతీమణి పద్మజ ఓటర్లను కోరారు. సోమవారం డాబాగార్డెన్స్‌లోని పలు ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. దక్షిణ నియోజకవర్గంలో జనసేన అభ్యర్థి వంశీకృష్ణ గెలుపు తథ్యమని 32వార్డు జనసేన నాయకులు, కార్పొరేటర్ కందుల నాగరాజు అన్నారు. సోమవారం వంశీకృష్ణకు మద్దతుగా వార్డులో విస్తృత ప్రచారం చేశారు. అధికార మార్పుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని వివరించారు. జనసేనకు ప్రజలనుంచి స్పందన లభిస్తుందన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న విష్ణుకుమార్‌రాజు



104 ఏరియాలో ప్రచారం చేస్తున్న బీజేపీ మద్దతుదారులు

ప్రజల ఆస్తులు దోచుకోవడానికే జీవో 512

» ఉత్తర నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి విష్ణుకుమార్ రాజు

సీతమ్మధార, ఏప్రిల్ 29: ప్రజల ఆస్తులను ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తన చేతుల్లో పెట్టుకోవడానికి, దోచుకోవడానికే జీవో 512 దోహదపడుతుందని మాజీ ఎమ్మెల్యే, ఉత్తర నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి విష్ణుకుమార్ రాజు ఆరోపించారు. సీతమ్మధారలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆస్తులపై ప్రజలు ఎటువంటి నిర్ణయం తీసుకోకుండా చేస్తున్న ఈ జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల నియమావళి అమలులో ఉండగా ఇలా జీవోలు, మెమోలు జారీ జారీ చేయడం అత్యంత దారుణమన్నారు. ఈ జీవోపై ప్రజలతోపాటు న్యాయవాదులూ వ్యతిరేకిస్తూ నిరసనలు, నిరాహార దీక్షలు చేస్తున్నా, ఇవేమీ పట్టించుకోకుండా సామాన్యుడికి ఇబ్బంది పెట్టేలా ఈ ప్రక్రియను జగన్మోహన్‌రెడ్డి చేయడం చాలా తప్పని అని అన్నారు. తక్షణం జీవో రద్దు చేయాలని, లేకుంటే కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే రద్దు చేసి ప్రజల ఆస్తులను కాపాడుతామని తెలిపారు. ఇలా జీవోలు తీసుకువచ్చే జగన్‌లాంటి ముఖ్యమంత్రికి ఓటు వేస్తే ఇంకెలాంటి పరిణామాలు ఉం టాయోనని హెచ్చరించారు. విశాఖలో పాలిటెక్నికల్ కాలేజీ, ఆర్అండ్‌బీ ఆఫీస్, ఎంఆర్‌ఓ ఆఫీస్ తదితర ఆస్తులన్నీ తాకట్టు పెట్టారన్నారు. ఇప్పుడు ప్రభుత్వ స్థలాల్లో లబ్ధిదారులకు నిర్మిస్తున్న ప్రధాన మంత్రి ఆవాజ్ యోజన ఇళ్లను తాకట్టు పెట్టకుండా ఉండరని గ్యారెంటీ ఏమిటని విష్ణుకుమార్ రాజు ప్రశ్నించారు. చంద్రబాబు హుదూద్ తుఫాన్ సమయంలో చేసిన సేవలను గుర్తుంచుకోవాలన్నారు. 14 ఏళ్లుగా ముఖ్యమంత్రిగా ఆయన చేసిన అభివృద్ధిని చూసి కూటమికి ఓటు వేయాలని కోరారు. ఎయిర్‌పోర్టులో చంద్రబాబును అడ్డుకుని అరా చకం సృష్టించే కేకే రాజును రౌడీ రాజు అనడంలో సందేహించాల్సిన అవసరంలేదన్నారు. వార్డు సచివాలయాలను సామాజిక భవనాల్లో నిర్వహించకుండా చూస్తామన్నారు. అన్న క్యాంటీన్లను తెరుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సమన్వయకర్త ఎండీ నజీర్, జనసేన పార్టీ నాయకులు పసుపులేటి ఉషాకిరణ్, డాక్టర్ రఘు పాల్గొన్నారు.

54వవార్డులో బీజేపీ విస్తృత ప్రచారం

మురళీనగర్: 54వవార్డు ప్రాంతాల్లో సోమవారం బీజేపీ నాయకులు విస్తృత ప్రచారం చేపట్టారు. కూటమి అభ్యర్థి పెన్మెత్స విష్ణుకుమార్ రాజుని ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరుతు ఆయన అల్లుడు సునీల్ కుమార్ ఇంటింటి ప్రచారం చేశారు. గతంలో ఎమ్మెల్యేగా పని చేసిన అనుభవమున్న నిస్వార్థ నేత విష్ణుకుమార్ రాజు ఓటు వేసి గెలిపించాలని కోరుతూ కరపత్రాలు అందించారు. 104 ఏరియా, బాపూజీ నగర్, పాత పోలీస్‌స్టేషన్ ఏరియా, జ్యోతినగర్ ప్రాంతాల్లో పర్యటించారు.

'కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యం'

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 29: 31వ వార్డులో కూటమి అభ్యర్థుల గెలుపు లక్ష్యంగా కృషి చేస్తున్నట్టు టీడీపీ వార్డు అధ్యక్షుడు బత్తిన నాగరాజు అన్నారు. వార్డు పరిధిలోని కనకలవీధి, తదితరప్రాంతాల్లోఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

కంచరపాలెం, ఏప్రిల్ 29 : మార్కెట్‌కు అని బయటకు వెళ్లిన మహిళ తిరిగి ఇంటికి రాకపోవడంతో కంచరపాలెం పోలీస్ స్టేషన్‌లో అదృ శ్యం కేసును నమోదైంది. వివరాలివి.. కంచరపాలెం పరిధి కప్పరాడ రాంజీ ఎస్టేట్ ప్రాంతానికి చెందిన మెరుగు సంధ్యారాణి (33), భర్త చనిపోవడంతో తండ్రి వద్ద ఉంటున్నారు. ఈనేపథ్యంలో ఈనెల 13వ తేదీన సంధ్యారాణి మార్కెట్‌కు వెళ్తున్నట్టు చెప్పి బయటకు వెళ్లారు. ఎంతకీ ఇంటికి తిరిగిరాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆమె కోసం పరిసరాలు ,బంధువుల ఇళ్లల్లో వెతికారు. ఆచూకీ తెలియకపోవడంతో తండ్రి రమేష్ బాబు పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసును నమోదు చేసి సీఐ భాస్కరరావు నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ కె.కృష్ణకుమారి కేసును దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి ఓటరు స్లిప్‌లు పంపిణీ

జ్ఞానాపురం, ఏప్రిల్ 29: ప్రతి ఓటర్లకు వారి ఓటు, పోలింగ్ కేంద్రాలతో వివరాలతో స్లిప్‌లను మంగళవారం నుంచి పంపిణీ చేస్తున్నట్టు పశ్చిమ ఈఆర్‌ఓ హుస్సేన్ సాహెబ్ తెలిపారు. సోమవారం స్థానిక కార్యలయంలో ఓటరు స్లిప్‌లను పరిశీలించి బీఎల్‌వోలకు అందజేశారు.త్వరతగతిన స్లిప్‌లను ఓటర్లకు అందజేయాలని సూచించారు.

సేవకుడిలా పనిచేస్తా..

» వైసీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కేకే రాజు



మాట్లాడుతున్న వైసీపీ అభ్యర్థి కేకే రాజు

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 29: ఎన్నికల్లో తనను గెలిపిస్తే నాయకునిలా కాకుండా సేవకునిగా అన్ని విధాల అందుబాటులో ఉండి పని చేస్తానని వైసీపీ ఉత్తరం ఎమ్మెల్యే అభ్యర్థి కేకే రాజు అన్నారు. 45వ వార్డు నరసింహనగర్‌లో కార్పొరేటర్, డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ కంపా హనోక్ ఆధ్వర్యంలో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నియోజకవర్గంలో రూ.435 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్టు తెలిపారు. వైసీపీ అధ్యక్షుడు పైడి రమణ, యాత కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లి సుజాత, డైరెక్టర్ రాయుడు శ్రీనివాస్ పాల్గొన్నారు. కేకే రాజు సమక్షంలో అక్కయ్యపాలెంలోని శివరామిరెడ్డి స్వీట్స్ అధినేత శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో పలువురు వైసీపీలో చేరారు. ఎంపీ అభ్యర్థిని బొత్స ఝాన్సీ లక్ష్మి, సిక్ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ ఆనంద్ సింగ్, జగదీష్, జీవీ రమణి పాల్గొన్నారు.

ప్రత్యేక హాకర్స్ జోన్ ఏర్పాటుకు కృషి...

ఫ్రూట్స్, పూలు, వెజిటబుల్స్ అసోసియేషన్ సభ్యులు, ఇతర వ్యాపారాలు చేసుకునే వారి కోసం ప్రత్యేక హాకర్స్ జోన్ ఏర్పాటు చేస్తానని కేకే రాజు హామీ ఇచ్చారు. తాటిచెట్లపాలెం ఎనభై అడుగుల రోడ్డు, పరిసర ప్రాంతాల ఫ్రూట్స్ మర్చంట్స్ సంఘాలతో సమావేశం నిర్వహించారు. పరిశీలకుడు చొక్కాకుల వెంకటరావు, 45, 55 వార్డుల కార్పొరేటర్లు కంపా హనోక్, కేవీఎన్ శశికళ, వైసీపీ అధ్యక్షుడు పైడి రమణ తదితరులు పాల్గొన్నారు.రామకృష్ణానగర్ షిర్డీ సాయిమందిరంలో అన్నసమారాధనను రాజు ప్రారంభించారు. బొడ్డేటి కిరణ్, జేసీఎస్ కన్వీనర్ జగదీష్ పాల్గొన్నారు.

టీడీపీ, బీజేపీ నుంచి వైసీపీలో చేరికలు

సీతమ్మధార: 55వ వార్డు ధర్మానగర్‌లోని టీడీపీ, బీజేపీలకు చెందిన నాయకులు, మహిళలు, కార్యకర్తలు వార్డు నా యకుడు భద్రి ఆధ్వర్యంలో వైసీపీలో చేరారు. వీరికి కేకే రాజు ఆహ్వానించారు.

మురళీనగర్: ఉత్తర నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చి దిద్దుతానని కేకే రాజు అన్నారు. 51వవార్డు మారియట్ హోటల్ నుంచి పాదయాత్రగా వెళ్లి పలు కాలనీల్లో ప్రచారం చేశారు. ప్రజల్ని మరోసారి మోసం చేయడానికి కూటమి పార్టీలు ప్రయత్నాలు చేస్తున్నాయన్నారు. అనంతరం అక్కయ్యపాలెం షాదీ ఖానా కల్యాణమండపంలో ఏర్పాటు చేసిన ముస్లింల ఆత్మీయ సమావేశానికి తరలి వెళ్లారు.

ముగిసిన నామినేషన్ల ఘట్టం

... 7వ పేజీ తరువాయి

చింతాడ సూర్యం (నవ భారత నిర్మాణ సేవా పార్టీ), జాలాది విజయకుమారి (సమాజ్‌వాదీ), తోట వెంకటసాయి ముకుంద్ (ప్రజా ప్రస్థానం పార్టీ), బన్నా రమేశ్(దళిత బహుజన పార్టీ), బిక్కవోలు చలమాజీ (నవరంగ్ కాంగ్రెస్ పార్టీ), వాండ్రాసి నాగ సత్యనారాయణ (రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్), పి.సత్యవతి (పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా) బరిలో మిగిలారు.

స్వతంత్రులు

ప్రధాన, రిజిస్టర్డ్ పార్టీల అభ్యర్థులు కాకుండా మరో 15 మంది స్వతంత్ర అభ్యర్థులుగా పోటీలో నిలిచారు. వీరిలో మురల అరుణశ్రీ, జీఎఎస్ ఆనంద్, కొల్లి నాగరాజు, మొహ్మద్ గౌస్ మొహిద్దీన్ ఖాన్, చప్పిడి రాము, పొన్నాడ జనార్దన్, పీడిది అప్పారావు, మళ్ల శ్రావణి, మెట్ట రామారావు, లగుడు గోవిందరావు, వడ్డి హరి గణేశ్, కర్రి వేణు మాధవ్, దేవర శంకర్, వాసుపల్లి సురేశ్, సొండి కృష్ణ ఉన్నారు.

అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా...

భీమిలి నియోజకవర్గంలో ఇద్దరు నామినేషన్లు ఉపసంహరించుకోగా 15 మంది పోటీలో ఉన్నారు. ప్రధాన పోటీ గంటా శ్రీనివాసరావు (టీడీపీ), ముత్తంశెట్టి శ్రీనివాసరావు (వైసీపీ) మధ్య జరగనున్నది. విశాఖ తూర్పు నియోజకవర్గంలో ఒకరు నామినేషన్ ఉపసంహరించుకోవడంతో 14 మంది బరిలో ఉన్నారు. తెలుగుదేశం అభ్యర్థిగా వెలగపూడి రామకృష్ణబాబు, వైసీపీ తరపున ఎంవీవీ సత్యనారాయణ, కాంగ్రెస్ నుంచి గుత్తల శ్రీనివాసరావు పోటీలో ఉన్నారు. అలాగే దక్షిణ నియోజకవర్గంలో సోమవారం ముగ్గురు నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. చివరకు 16 మంది మిగిలారు. ఇక్కడ జనసేన నుంచి సీహెచ్ వంశీకృష్ణశ్రీనివాస్, వైసీపీ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అభ్యర్థులుగా ఉన్నారు. విశాఖ ఉత్తర నియోజకవర్గంలో చివరిరోజు ఇద్దరు నామినేషన్లు ఉపసంహరించుకోగా బరిలో 15 మంది ఉన్నారు. బీజేపీ నుంచి పి.విష్ణుకుమార్‌రాజు, వైసీపీ తరపున కేకే రాజు, జైభారత్ పార్టీ నుంచి వీవీ లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ నుంచి లక్కరాజు రామారావు బరిలో ఉన్నారు. పశ్చిమ నియోజకవర్గంలో ముగ్గురు నామినేషన్లు ఉపసంహరించుకోవడంతో 13మంది పోటీలో ఉన్నారు. తెలుగుదేశం పార్టీ తరపున పి.గణబాబు, వైసీపీ తరపున ఆడారి ఆనందకుమార్, సీపీఐతరపున ఎ.విమల పోటీ చేస్తున్నారు.గాజువాకలో ఇద్దరు నామినేషన్లు ఉపసంహరించుకోగా, పోటీలో 15 మంది మిగిలారు. పల్లా శ్రీనివాసరావు (తెలుగుదేశం), గుడివాడ అమర్‌నాథ్ (వైసీపీ), సీపీఎం నుంచి మరడాన జగ్గునాయుడు అభ్యర్థులుగాఉన్నారు.పెందుర్తిలోసోమవారంనలుగురు నామినేషన్లు ఉపసంహరించుకోవడంతో 14మంది పోటీలో ఉన్నారు. జనసేన తరపున పంచకర్ల రమేష్‌బాబు, వైసీపీనుంచిఅన్నంరెడ్డి అదీప్‌రాజ్, కాంగ్రెస్ అభ్యర్థిగా పిరిడి భగత్ బరిలో ఉన్నారు.

చర్చలకు ముందుకురాని 'అదానీ'

... 7వ పేజీ తరువాయి

పోర్టు యాజమాన్యం మాటపై నిలబడడం లేదని, అందుకే తాము ఒప్పుకోవడం లేదని స్పష్టంచేశారు.

కార్మిక శాఖ కార్యాలయంలో చర్చలు

విశాఖపట్నం కార్మిక శాఖ అధికారి కార్యాలయంలో సోమవారం సాయంత్రం నిర్వాసిత కార్మికులతో చర్చలు జరిపారు. స్టీల్‌ప్లాంటు ఇబ్బందుల్లో ఉన్నందున సహకరించాలని, సమ్మె విరమించాలని ఆయన కోరారు. ముందస్తు నోటీసు ఇవ్వకుండా సమ్మె చేయడం తగదని చెప్పారు. దీనికి కార్మికులు బదులిస్తూ, గతంలో 64 రోజులు సమ్మె చేసినా సమస్యలు పరిష్కరించలేదని, అందుకే ఇలా చేయాల్సి వచ్చిందన్నారు. తమను వన్‌టైమ్ సెటిల్‌మెంట్‌కు రమ్మని చెప్పినందున ఒక్కొక్కరికి రూ.50 లక్షలు కావాలని అడిగామని, అనేక చర్చలు జరిపిన మీదట రూ.35 లక్షలకు దిగి వచ్చామన్నారు. పోర్టు యాజమాన్యం దానికి అంగీకరిస్తే ఈ క్షణమే సమ్మె విరమిస్తామన్నారు. డబ్బులు కూడా వెంటనే ఇవ్వాల్సిన అవసరం లేదని, నెల రోజులు గడువు తీసుకొని ఇవ్వవచ్చునన్నారు. ఇంతకు మించి తాము చెప్పేదేమీ లేదని పేర్కొంటూ అదే డిమాండ్‌తో కార్మిక శాఖ అధికారికి లేఖ సమర్పించారు. సమస్యను ఇలాగే కొనసాగిస్తే ప్రస్తుతం జరుగుతున్న సాధారణ ఎన్నికలను కూడా తాము బహిష్కరిస్తామని స్పష్టంచేశారు.

కార్మికులపై యాజమాన్యం వేటు

అదానీ గంగవరం పోర్టులో రెండు వేల పైచిలుకు ఉద్యోగులు ఉన్నారు. వారిలో నిర్వాసిత కార్మికులు 500 మంది. వీరు కాకుండా మిగిలిన వారిని యాజమాన్యమే నియమించుకుంది. నిర్వాసిత కార్మికుల సమ్మె మొదలైన తరువాత వారి నాయకుల్లో 12 మందిపై పోలీసులతో కేసు పెట్టించారు. ఆపరేషన్లు నిలిచిపోవడానికి లోపల కూడా కొంతమంది సహకరిస్తున్నారనే ఆరోపణలతో ఐదుగురు ఉద్యోగులను సస్పెండ్ చేశారు. మరో ముగ్గురిని పశ్చిమ బెంగాల్, ఒడిశా, ఝార్ఖండ్‌లకు బదిలీ చేశారు. దీనిని కార్మిక సంఘాలు తప్పుపడుతున్నాయి. ఇప్పుడు మిగిలిన ఉద్యోగులు కూడా తమకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తుంటే...దానిపై చర్చించలేమని పోర్టు ప్రతినిధులు చెబుతున్నారు. ఈ కక్ష సాధింపులు మానేసి, పక్కనే ఉన్న విశాఖపోర్టు మాదిరిగాన్యాయమైనవేతనాలు ఇవ్వాలని వారంతా డిమాండ్ చేస్తున్నారు.

రేషన్ డిపోలు విభజన అస్తవ్యస్తం

... 7వ పేజీ తరువాయి

విధానం తీసుకువచ్చారు. దీని ప్రకారం విశాఖ జిల్లాలో ఒక గోదాము పరిధిలో డిపోలను మరో గోదాము పరిధిలోకి మార్చారు. నగరంలో మర్రిపాలెంలో రెండు గోదాముల నుంచి సర్కిల్-1, 2 పరిధిలో గల డిపోలకు సరకులు సరఫరా చేస్తారు. సర్కిల్-1లో పెందుర్తి నుంచి వన్‌టౌన్ కోటవీధి వరకూ ఉన్న డిపోలకు మర్రిపాలెం ఎంఎల్ఎస్ పాయింట్ (గోదాము-1) నుంచి, సర్కిల్-2లో తాటిచెట్లపాలెం నుంచి మధురవాడ వరకూ గల డిపోలకు మర్రిపాలెం ఎంఎల్ఎస్ పాయింట్ (గోదాము-2) నుంచి సరకులు పంపిణీ చేస్తున్నారు. అయితే మర్రిపాలెంలో రెండు గోదాముల నుంచి డిపోలకు సరకుల రవాణాకు అయిన ఖర్చు మాత్రం వేర్వేరుగా ఉంది. గోదాము-1 నుంచి రవాణాకు క్వింటాకు రూ.21, గోదాము-2 నుంచి అయితే క్వింటాకు రూ.32 చార్జీగా ఇస్తున్నారు. ఇటువంటి తేడాలు రాష్ట్రంలో అనేకచోట్ల ఉండడంతో రవాణా చార్జీలను సవరించాలని భావించిన అధికారులు జాతీయ స్థాయిలో అమలులో ఉన్న రూట్ ఆప్టిమైజేషన్ విధానం తీసుకువచ్చారు. దీనిప్రకారం సర్కిల్-2లో గల 152 డిపోలలో 69 డిపోలను సర్కిల్-1కు, మరో 25 డిపోలను భీమునిపట్నం కేటాయించారు. దీని ప్రకారం సర్కిల్-2లో ఉన్న డిపోలకు మర్రిపాలెం గోదాము-2కు బదులుగా గోదాము-1, భీమునిపట్నం గోదాముల నుంచి సరకులు అందిస్తారు. అధికారులు తీసుకున్న నిర్ణయంపై డీలర్లు, గోదాము-1 కలాసీలు, సరకులు రవాణా చేసే కాంట్రాక్టర్ అభ్యంతరం చెప్పినా పౌర సరఫరాల సంస్థ అధికారులు పట్టించుకోలేదు. సాధారణంగా ప్రతినెలా ఒకటో తేదీ నుంచి కార్డుదారులకు సరకులు పంపిణీ చేయడానికి పది రోజుల ముందుగానే గోదాము నుంచి డిపోలకు చేరవేయడం మొదలెడతారు. అయితే డిపోల విభజన వల్ల నగరంలో 30 శాతం డిపోలకు ఇంతవరకూ సరకులు అందలేదు. దీంతో వచ్చే నెల ఒకటో తేదీ నుంచి కార్డుదారులకు సరకులు పంపిణీపై అనుమానం వ్యక్తమవుతుంది. తాజాగా అధికారులు తీసుకున్న నిర్ణయం మేరకు మర్రిపాలెం గోదాము-1 కింద 221 డిపోలు, గోదాము-2కు కేవలం 58 డిపోలు అప్పగించారు. దీనిపై కలాసీలు, కాంట్రాక్టర్ అభ్యంతరం వ్యక్తంచేశారు. కాంట్రాక్టరు హైకోర్టులో కేసు వేశారు. ఇంకా డిపోల విభజనపై డీలర్లు అభ్యంతరం వ్యక్తంచేస్తూ కలెక్టర్‌కు ఫిర్యాదు చేయాలని నిర్ణయించారు.

ఐఏఎస్ అధికారికి గ్రేటర్ నజరానా!

... 7వ పేజీ తరువాయి

ఆస్తి పన్ను విధించారు. నిర్మాణం పూర్తయిన తర్వాత ఖాళీగా ఉండిపోవడంతో ఆ భవనాన్ని జీవీఎంసీ అవసరాల కోసం అద్దెకు తీసుకునేలా చూడాలని సదరు ఐఏఎస్ అధికారి...మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్టుమెంట్‌లో చక్రం తిప్పుతున్న సీనియర్ ఐఏఎస్ అధికారి ద్వారా జీవీఎంసీ అధికారికి చెప్పించినట్టు సమాచారం. సీనియర్ ఐఏఎస్ అధికారి చెప్పడమే తరువాయి అన్నట్టు జీవీఎంసీ అధికారి విశాలాక్షినగర్‌లో ఐఏఎస్ అధికారి భార్య పేరిట ఉన్న ఐదంతస్థుల భవనాన్ని నగర పాలక సంస్థ అవసరాల కోసం గెస్ట్‌హౌస్‌గా తీసుకోవాలని నిర్ణయించేశారు. నెలకు రూ.20 లక్షలు అద్దె చెల్లించడంతోపాటు కరెంట్ బిల్లు, అక్కడ పనిచేయడానికి సిబ్బంది నియామకం కూడా జీవీఎంసీయే భరించేలా ఒప్పందం చేసుకున్నట్టు విపక్షాలు ఆరోపిస్తున్నాయి. నిబంధనల ప్రకారం ఏదైనా రెసిడెన్షియల్ భవనాన్ని ప్రభుత్వ శాఖలు అద్దెకు తీసుకోవాలనుకుంటే చదరపు అడుగుకు గరిష్ఠంగా రూ.20 మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది. అంతకుమించి చెల్లించాల్సి వస్తే కౌన్సిల్ నుంచి ప్రత్యేక అనుమతి పొందాల్సి ఉంటుంది. కానీ అవేమీ పాటించకుండా నెలకు రూ.లక్షల్లో అద్దె చెల్లించేందుకు జీవీఎంసీ అధికారి నిర్ణయం తీసేసుకున్నారు. ఇక ఒప్పందం జరిగి నాలుగు నెలలు గడిచినానగరానికి వచ్చిన అతిథి ఒక్కరు కూడా ఆ భవనంలో బసచేసిన దాఖలాలు లేవు. అయినా, విస్కో నుంచి ప్రతి నెలా అద్దె చెల్లింపు మాత్రం జరిగిపోతోంది. ఒకవేళ జీవీఎంసీకి వచ్చిన అతిథులకు స్టార్ హోటల్‌లో వసతి కల్పించినా గెస్ట్‌హౌస్‌కు చెల్లించే అద్దెలో పది శాతానికి మించి ఖర్చయ్యే అవకాశం ఉండదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇదిలావుండగా అధికారులు మాత్రం జీవీఎంసీ పనుల మీద నగరానికి వచ్చే అతిథులు బస చేయాల్సి వస్తే ఒక గెస్ట్‌హౌస్ ఉండాలనే ఉద్దేశంతోనే ఆ భవనాన్ని అద్దెకు తీసుకున్నామని సమర్థించుకుంటున్నారు. అలాగే గెస్ట్‌హౌస్‌కు చెల్లించే అద్దె కూడా రూ.20 లక్షలు కాదని, కేవలం రూ.2.1 లక్షలు మాత్రమేనని చెబుతున్నారు. కానీ అందుకు సంబంధించిన అధికారిక వివరాలను మాత్రం బయటపెట్టడం లేదు. గెస్ట్‌హౌస్ వ్యవహారాన్ని విపక్ష కార్పొరేటర్లు బయటపెట్టడంతో ఉలిక్కిపడిన జీవీఎంసీ అధికారి జరిగిన తప్పును సరిదిద్దుకోవడంపై దృష్టిపెట్టకుండా, ఆ సమాచారం బయటకు ఎలా వెళ్లిందనే దానిపై నీటి సరఫరా, విస్కో, రెవెన్యూ విభాగం అధికారులను పిలిచి ఆరా తీస్తున్నట్టు తెలిసింది.



అధికారులతో సమావేశమైన ఈఓ శ్రీనివాసమూర్తి

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ : ఈఓ

సింహాచలం, ఏప్రిల్ 29 : సింహగిరిపై వచ్చేనెల 10న జరిగే వరాహలక్ష్మీనృసింహస్వామి చందనోత్సవం పురస్కరించుకుని పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఈఓ శ్రీనివాసమూర్తి ఆదేశించారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో ఇంజినీరింగ్, శానిటేషన్ విభాగాలకు చెందిన అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉత్సవానికి లక్షలాది మంది భక్తులు వచ్చే అవకాశం ఉండడంతో పారిశుధ్యం నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు.అవసరం మేరకు అదనపు సిబ్బందిని తాత్కాలిక ప్రాతిపదికన విధుల్లోకి తీసుకుని ఉత్సవానికి ముందు (మే 8న) జరిగే గంధం అమావాస్య నుంచి నాలుగు రోజుల పాటు పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలన్నారు. పారిశుధ్య నిర్వహణలో భాగంగా కాలువలకు మరమ్మతులు చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులు, పారిశుధ్యం విభాగం అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఏఈఓ రమణమూర్తి, ఇన్‌చార్జి ఏఈఓ పాలూరి నరసింగరావు, పర్యవేక్షణాధికారులు గాయత్రి లక్ష్మీప్రసన్న, డీఈలు నాగేశ్వరరావు, రామరాజు, సింహగిరి పారిశుధ్య కార్మిక సంఘం, కేఎల్‌టీ పారిశుధ్య సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

'ఎన్నికల నిర్వహణకు సహకరించండి'

పద్మనాభం, ఏప్రిల్ 29 : గ్రామాల్లో అల్లర్లు లేకుండా ప్రశాంత ఎన్నికల నిర్వహణకు ప్రజలు సహకరించాలని మధురవాడ జోన్ ఏసీపీ సునీల్ చెప్పారు.సోమవారం రాత్రి ఆయన రేవిడి, మద్ది గ్రామాల్లో ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యక్తులను రెచ్చగొట్టి ఘర్షణ చెలరేగేలా చేస్తే రౌడీషీట్ నమోదు చేసి చర్యలు తీసుకుంటామన్నారు. యువకులు గొడవల్లో దూరి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా నిరంతరం పర్యవేక్షణ చేయడానికి గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని తెలిపారు. అనంతరం గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు.కార్యక్రమంలో ఎంపీపీ రాంబాబు, ఎంపీడీఓ శైలజ, సీఐ శ్రీధర్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టరు రామకృష్ణ పాల్గొన్నారు.

'సూపర్ సిక్స్..పేదలకు వరం'



కొమ్మాదిలో కూటమి నాయకులతో భరద్వాజ్

ఆనందపురం, ఏప్రిల్ 29 : చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలు పేదలకు వరమని కూటమి ఎంపీ అభ్యర్థి శ్రీభరత్ సోదరుడు భరద్వాజ్ అన్నారు. సోమవారం ఆయన వెల్లంకిలో గంటా శ్రీనివాసరావు, శ్రీభరత్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టీడీపీ అభ్యర్థులను గెలిపించడం ద్వారా రాష్ట్రాభివృద్ధికి సహకరించాలని కోరారు.ఈమేరకు ఆయన ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొమ్మాది : విశాఖ అభివృద్ధి చెందాలంటే ఎన్డీఏ కూటమి ఎంపీ అభ్యర్థి శ్రీభరత్‌ను, అసెంబ్లీ అభ్యర్థి గంటా శ్రీనివాసరావును గెలిపించాలని శ్రీభరత్ సోదరుడు భరద్వాజ్ కోరారు. సోమవారం ఆయన 5వ వార్డులో కార్పొరేటర్ మొల్లి హేమలత ఆధ్వర్యంలో శారదానగర్‌లో ప్రచారం నిర్వహించారు. అలాగే విశాఖ పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షుడు గురునాథ్ ఆధ్వర్యంలో పీఎం పాలెం, ఎఫ్‌సీఐ లేఅవుట్, తదితర ప్రాంతాల్లో ప్రచారం చేశారు.

సింహాచలం : జీవీఎంసీ 98వ వార్డులోని కాపువీధి, రాజావీధి, పోస్టాఫీసు వీధి, మధ్య వీధి తదితర ప్రాంతాల్లో కార్పొరేటర్ పివి నరసింహం ఆధ్వర్యంలో కూటమి నాయకులు, కార్యకర్తలు ప్రచారం చేశారు. కార్యక్రమంలో బీజేపీ వార్డు అధ్యక్షుడు బసన అప్పలనాయుడు, కె. రామకృష్ణ, జనసేన అధ్యక్షుడు మజ్జి సూరిబాబు, టీడీపీ అధ్యక్షుడు పంచదార్ల శ్రీనివాస్, సిరిపురపు సురేష్, సతివాడ శంకరరావు, గుసిడి శంకరరావు, రాజనాల సత్యారావు, గంర్రెడ్డి వెంకటరమణ పాల్గొన్నారు.

సినిమా గైడ్

● **రత్నం :** జగదాంబ, శరత్, శ్రీరామ, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్ (పెందుర్తి), సీతారామయ్య (పరవాడ), రాములమ్మ (తగరపువలస)
● **గీతాంజలి మళ్ళీ వచ్చింది :** శ్రీకన్య, రమాదేవి, ఊర్వశి (కంచరపాలెం) మౌర్య (గోపాలపట్నం), హెవెన్-3 (గోపాలపట్నం), నటరాజ్-2 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
● **ది ఫ్యామిలీ స్టార్ :** కామేశ్వరి, శ్రీనరసింహ (గోపాలపట్నం)
● **టిల్లు స్క్వేర్ :** మెలోడి, శారద, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), తాతా (తగరపువలస)
● **గాడ్జిల్లా వర్సెస్ కాంగ్ :** శ్రీవెంకటేశ్వర, లక్ష్మీకాంత్ (గాజువాక)
● **మంజుమ్మెల్ బోయ్స్ :** సంగం, వెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 22, టమాటా 24, వంకాయలు (తెలుపు) 26, వంకాయలు (నలుపు) 16, బెండకాయలు 28, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 34, బీరకాయలు 40, ఆనపకాయలు 14, కాలీఫ్లవర్ 30, క్యాబేజ్ 22, క్యారెట్ 36, దొండకాయలు 28, బంగాళా దుంపలు 28, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 34, అల్లం (పాతది) 150, బరబటి 30, ముల్లంగి 42, నిమ్మకాయలు (కిలో) 105, గోరుచిక్కుడు 28, దోస కాయలు 24, వెల్లుల్లి (పెద్దవి) 190, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 84, పొటల్స్ 48, కీరదోస 28, కాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 34, చిలగడదుంపలు 36, కంద 60, దేముడు చిక్కుడు 60, కొండఉసిరి 90, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 28, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 38, జామకాయలు (కిలో) 40.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	400
విజయనగరం	404
శ్రీకాకుళం	404

చికెన్ ధరలు

బ్యాగ్		
రైతు ధర	--	120
ఫారం ధర	--	140
విత్ స్కిన్	--	250
స్కిన్‌లెస్	--	260

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..



గంటాను సత్కరిస్తున్న మండల టీడీపీ నాయకులు



గంధవరంలో గజమాలతో గంటాకు స్వాగతం

కూటమి విజయం ఖాయం

- భీమిలి అభ్యర్థి గంటా శ్రీనివాసరావు
- పద్మనాభంలో విస్తృతంగా ప్రచారం
- బైకులు, కార్ల ర్యాలీతో హోరెత్తిన గ్రామాలు



అనంతవరం ప్రచార సభలో మాట్లాడుతున్న కూటమి అభ్యర్థి గంటా

పద్మనాభం/పద్మనాభం రూరల్, ఏప్రిల్ 29 : టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు మళ్లీ ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు తీస్తుందని భీమిలి కూటమి అభ్యర్థి గంటా శ్రీనివాసరావు అన్నారు. సోమవారం ఆయన గంధవరం, కొత్త కొవ్వాడ, పాత కొవ్వాడ, పెంట, అనంతవరం, బాందేవపురం, విలాస్‌ఖాన్‌పాలెం గ్రామా ల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు, ముందుగా మాజీ ఎంపీపీ డి. గోపీబాబు ఆధ్వర్యంలో పద్మనాభం నుంచి భారీ ఎత్తున బైక్, కార్ల ర్యాలీ నిర్వహించారు. గంధవరం, కొవ్వాడ, పెంట తదితర గ్రామాల్లో నిర్వహించిన ప్రచార సభల వరకు ఈ ర్యాలీ కొనసాగింది. కూటమి శ్రేణులు మండుటెండను కూడా లెక్క చేయకుండా ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొన్నారు. మహిళలు అడుగడుగునా హారతులు పడుతూ బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా పద్మనాభంలో గంటా మాట్లాడుతూ వచ్చే నెల 13న జరిగే ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించడం ఖాయమన్నారు. ఏ గ్రామానికి వెళ్లినా యువత, మహిళలు బ్రహ్మరథకం పడుతున్నారని, ప్రస్తుత ఎన్నికల ప్రచారంలో ప్రజల స్పందన చూస్తుంటే టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్‌టీ రామారావు పార్టీ పెట్టే సమయంలో వచ్చిన స్పందన కనిపిస్తోందన్నారు. రాష్ట్రాన్ని తిరోగమన దిశగా మార్చిన ఘనుడు వైఎస్ జగన్ అని విమర్శించారు. జాబ్ క్యాలెండరు లేకపోవడం, మెగా డీఎస్సీ తీయకపోవడం, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం నీరుగార్చడం, ప్రత్యేక హోదాను సాధించలేకపోవడం, రైల్వే జోన్, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు తదితర ఏ పనులను చేపట్టలేకపోయారన్నారు. రాష్ట్రానికి రావాల్సిన పరిశ్రమలు కూడా పక్క రాష్ట్రాలకు తరలిపోవడంతో యువతకు ఉపాధి అవకాశాలు లేక పక్క రాష్ట్రాలకు వెళ్లాల్సి వస్తోందన్నారు. ఏ ఉద్దేశంతో కూటమి ఆవిర్భవించిందో ఆ ఆశయం శతశాతం నెరవేరుతుందన్నారు. రాష్ట్ర భవిషత్తుకు బంగారు బాటలు వేయడానికి చంద్రబాబుకు పట్టం కట్టడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. గ్రామాలు అభివృద్ధి చెందాలంటే కూటమి అధికారంలోకి రావాలన్నారు. వైసీపీ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లోనూ విఫలమైందని విమర్శించారు. నిరుద్యోగ యువత భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఐదేళ్ల వారి పాలన అవినీతి, అరాచకాలు తప్ప అభివృద్ధి మాట ఎక్కడా కనిపించలేదని పేర్కొన్నారు. గ్రామాల్లో ప్రజలకు సేవ చేయాల్సిన ప్రజాప్రతినిధులను ఉత్సవ విగ్రహాలుగా మార్చారన్నారు. పంచాయతీలకు నిధులు ఇవ్వకపోవ డంతో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని చెప్పారు. ఇలాంటి పాలకులను సాగనంపి, అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ అయిన చంద్రబాబు పాలనను తీసుకురావాల్సిన ఆవశ్యకత ఏర్పడిందన్నారు. టీడీపీ సూపర్ సిక్స్ పథకాల ముందు వైసీపీ మేనిఫెస్టో వెలవెలబోయిందని, జగన్ మేనిఫెస్టోను ప్రజలు నమ్మరాదని కోరారు. వచ్చే నెల 13న జరిగే పోలింగ్‌లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా, శ్రీభరత్‌ను ఎంపీగా భారీ మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. కాగా ప్రచారంలో భాగంగా గంటాకు ప్రతి గ్రామంలోనూ మహిళలు హారతులు పట్టి ఘన స్వాగతం పలికారు. గంధవరం, కొత్తకొవ్వాడ, పాతకొవ్వాడ, పెంట గ్రామాల్లో ప్రచార కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. యువకులు, మహిళలు డప్పువాయిద్యాలు, కోలాటాలతో ఘనంగా స్వాగతం పలికారు. గంధవరంలో గంటాకు భారీ గజమాలను అలంకరించారు. కొవ్వాడలో మాజీ ఎంపీపీ డి. గోపీబాబు తన ఇంటికి వచ్చిన గంటాను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి నిమ్మల కిష్టప్ప, భీమిలి ఇన్‌చార్జి రాజబాబు, వీఎంఆర్‌డీఏ మాజీ ఛైర్మన్ అక్కరమాని విజయనిర్మల, ఏ. వెంకటరావు, టీడీపీ మండల అధ్యక్షుడు కె. రమణ, టీడీపీ మాజీ మండల అధ్యక్షుడు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దామోదరరావు, మాజీ ఎంపీపీలు లీలావతి, గోపీబాబు, నాయకులు గణేష్, కోన శ్రీను, విజయబాబు, బోదల పావని, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. కాగా అనంతవరం, విలాస్‌ఖాన్‌పాలెం, బాందేవుపురం గ్రామాల్లో గంటా సోమవారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల కంటే భీమిలిలో రూ. 3800 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు.

భీమిలి అసెంబ్లీ బరిలో 15 మంది

ఇద్దరు నామినేషన్లు ఉపసంహరణ

భీమునిపట్నం, ఏప్రిల్ 29 : భీమిలి అసెంబ్లీ స్థానానికి 15 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. మొత్తం 20 మంది నామినేషన్లు దాఖలు చేయగా, పరిశీలన అనంతరం మూడు నామినేషన్లను అధికారులు తిరస్కరించారు. దీంతో 17 మంది నామినేషన్లకు అర్హత సాధించినట్టు అధికారులు ప్రకటించారు.చివరి రోజు సోమవారం దాసరి లక్ష్మీ సంధ్య (ప్రజా ప్రస్థానం పార్టీ), ఏలూరు ధర్మావతి (స్వతంత్ర) నామినేషన్లు ఉపసంహరించుకోవడంతో 15 మంది పోటీలో నిలిచినట్టు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి భాస్కర్‌రెడ్డి తెలిపారు.

అభ్యర్థుల వివరాలు

పోటీల్లో అడ్డాల వెంకట వర్మరాజు (కాంగ్రెస్), గంటా శ్రీనివాసరావు (టీడీపీ), భాగం గోపాలరావు (బహుజన సమాజ్ పార్టీ), ముత్తంశెట్టి శ్రీనివాసరావు (వైసీపీ), అనిల్‌కుమార్ ఇల్లిపిల్లి (జై భారత్ జాతీయ పార్టీ), కోలా హరిబాబు (రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా-ఎ), గంట శ్రీనివాసరావు (జాతీయ జనసేన పార్టీ), రాజు చోడిపల్లి (సమాజవాది పార్టీ) ఉన్నారు. స్వతంత్ర అభ్యర్థులు ఏడుగురు బరిలో నిలిచారు. చొప్పల్లి శరవణ్ గణేష్‌శర్మ, నాగోతు నాగమణి, నూకల సూర్య ప్రకాశ్, నందికోళ్ల సంధ్య, బావిశెట్టి రమణబాబు, బుగత రాము, మేకా సత్య కిరణ్ పోటీలో ఉన్నారు. వీరిలో బుగత రాముకు గ్లాస్ టంబ్లర్ (గాజు గ్లాసు) గుర్తు కేటాయించారు. టీడీపీ అభ్యర్థి గంటా శ్రీనివాసరావు, జాతీయ జనసేన పార్టీ అభ్యర్థిగా పోటీలో వున్న గంట శ్రీనివాసరావు పేర్లు ఒకేలా వున్నా గుర్తులు వేర్వేరుగా కేటాయించారు. గంటా శ్రీనివాసరావు (టీడీపీ)కు గుర్తు సైకిల్ కాగా, గంట శ్రీనివాసరావు (జాతీయ జనసేన పార్టీ)కు పెన్ గుర్తు వచ్చింది.అలాగే స్వతంత్ర అభ్యర్థిగా ఉన్న సీతమ్మధార ఆర్‌కేనగర్‌కు చెందిన సత్య కిరణ్ టీడీపీ నాయకుడు. ప్రజా సేవ చేయాలన్న ఆకాంక్షతో పోటీలో ఉన్నట్టు ఆయన తెలిపారు.

'తూర్పు'లో 14 మంది

ఒకరు నామినేషన్ ఉపసంహరణ

విశాఖపట్నం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : నామినేషన్ల ఉపసంహరణ తరువాత తూర్పు అసెంబ్లీ స్థానంలో 14 మంది బరిలో నిలిచారు. చివరి రోజు ఇండిపెండెంట్ అభ్యర్థి డాక్టరు మాథ్యూ సురేష్ మీనన్ తన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. దీంతో 14 మంది బరిలో ఉన్నారు. వెలగపూడి రామకృష్ణబాబు (టీడీపీ), ఎంవీవీ సత్యనారాయణ (వైసీపీ), గుత్తల శ్రీనివాసరావు (కాంగ్రెస్), జోసఫ్ పీటర్ (బీఎస్పీ), అదపాక దాలిరాజు (నవ భారత నిర్మాణ సేవా పార్టీ), కొంగరపు గణపతి (రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా), తోట వెంకట సాయి ముకుంద (ప్రజా ప్రస్థానం పార్టీ), యడ్ల వేణుగోపాల కృష్ణ (భారతీయ యువజన పార్టీ), ఈ. హైమావతి (పిరమిడ్ పార్టీ) బరిలో ఉన్నారు. స్వతంత్రులుగా అనగాని శివరామకృష్ణన్, అదాడ రమణి, ఉమ్మిడి. భాస్కరరావు, బర్ల అప్పల పద్మాకర్ యాదవ్, వడ్డీ శిరీష ఉన్నారు. కాగా సిటింగ్ ఎమ్మెల్యే వెలగపూడి టీడీపీ నుంచి నాలుగోసారి బరిలో ఉన్నారు. ఆయన ఇప్పటికే మూడుసార్లు తూర్పు నుంచి గెలిచారు. ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ అధికార వైసీపీ నుంచి తొలిసారిగా తూర్పు నుంచి పోటీ చేస్తున్నారు.



జేవీ అగ్రహారం ప్రచారంలో పాల్గొన్న ముత్తంశెట్టి శ్రీనివాసరావు



4వ వార్డులో జరిగిన ప్రచారంలో వైసీపీలో చేరిన వారితో శ్రీనివాసరావు, తదితరులు



క్యాంపు కార్యాలయంలో మహిళలకు వైసీపీ కండువాలు వేస్తున్న అవంతి

అందుబాటులో ఉంటా..అభివృద్ధి చేస్తా : ముత్తంశెట్టి

భీమునిపట్నం, ఏప్రిల్ 29 : ముఖ్యమంత్రి జగన్ గ్రామ సచివాలయాల ఏర్పాటుతో ప్రజల ముంగిటకు పాలనను చేరువ చేశారని వైసీపీ భీమిలి అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం ఆయన 4వ వార్డు జేవీ అగ్రహారం, బూరపేట, కొత్తవలస గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సామాన్యులకు ఏమి కావాలో తెలుసుకుని అమలు చేసిన గొప్ప వ్యక్తి జగన్ అన్నారు. ముఖ్యంగా పల్లెల్లో ఆస్పత్రులు, రైతు భరోసా కేంద్రాలు, సచివాలయాల ఏర్పాటుతో ప్రజల ఇబ్బందులు తొలగించారన్నారు. జగన్ ఏమి చెబుతారో అదే చేస్తారని, ప్రజా సంక్షేమ పాలన వైసీపీకే సాధ్యమని తెలిపారు. భీమిలి అభివృద్ధి పథంలో నడవాలన్నా,ఉత్తరాంధ్ర అభివృద్ధి జరగాలన్నా.. వైసీపీ ప్రభుత్వానికి మద్దతు ఇవ్వాలని కోరారు. మే 13న జరిగే ఎన్నికల్లో రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా బొత్స ఝాన్సీని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కాగా అంతకముందు వైసీపీ నాయకుడు బోర రామకృష్ణ యాదవ్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. అలాగే టీడీపీ, జనసేనకు చెందిన పలువురు వైసీపీలో చేరగా వారికి ముత్తంశెట్టి కండువాలు వేసి, పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ దౌలపల్లి ఏడుకొండలరావు, నాయకులు బూర రామకృష్ణ యాదవ్, మేరుగు చిన్నారావు, బాడితబోయిన రాములప్పడు, తదితరులు పాల్గొన్నారు.

అవంతికే మా మద్దతు

ఏ సమస్య వచ్చినా.. అందుబాటులో వుండి పరిష్కరించే అవంతి శ్రీనివాసరావుకే తమ మద్దతు అని 3వ వార్డు రెల్లి వీధి మహిళలు స్పష్టం చేశారు. సోమవారం మధ్యాహ్నం వారు క్యాంప్ కార్యాలయానికి వచ్చి ముత్తంశెట్టిని కలిసారు. తమ గ్రామం ఏ సమస్య వచ్చి చెప్పినా.. వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకోవడమే కాకుండా పలుమార్లు తమ గడపకు వచ్చి మాట్లాడారని చెప్పారు. సంక్షేమ పథకాలు అందుతున్నది, లేనిది తెలుసుకుని మరీ ఆయా పథకాలు వర్తింపజేసిన అవంతిని ఎప్పటికీ మరువమన్నారు. అందుబాటులో వుండే అవంతికే తమ మద్దతు అని స్పష్టం చేశారు. అనంతరం ముత్తంశెట్టి మాట్లాడుతూ ప్రత్యర్థులు చెప్పే మాయమాటలకు, ప్రలోభాలకు లొంగిపోవద్దని, సంక్షేమ ప్రభుత్వాన్ని మళ్లీ అధికారంలోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ వైసీపీ నాయకులు ముక్కి కృష్ణ, 3వ వార్డు ఇన్‌చార్జి షైలపల్లి షణ్ముఖరావు, వార్డు అధ్యక్షుడు నరసింగరావు,నాయకులు పోతురాజు, పిన్నింటి ఎర్రయ్యరెడ్డి, పాల్గొన్నారు.



జాలారి ఎండాడలో సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను పంచుతున్న ఎమ్మెల్యే వెలగపూడి

ప్రజల ప్రేమాభిమానాలకే లొంగుతాను

- ఊటగడ్డలో వెలగపూడి ప్రచారం



ఊటగెడ్డ ప్రాంతంలో వెలగపూడి ప్రచారం

ఎంవీపీ కాలనీ/రామ్‌నగర్, ఏప్రిల్ 29 : రాష్ట్రం, నగరం అభివృద్ధి చెందాలంటే కూటమి అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందని కూటమి తూర్పు అభ్యర్థి వెలగపూడి రామకృష్ణబాబు అన్నారు. సోమవారం ఆయన 19 వార్డులోని జాలారి ఎండాడ, వాసువానిపాలెంలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా అక్కడి ప్రజలతో ఆప్యాయంగా మాట్లాడారు. అన్ని మతాలు, కులాలకు సమ ప్రాధాన్యమిచ్చే పార్టీ తెలుగుదేశం అన్నారు. విశాఖను ఏం అభివృద్ధి చేశారో చెప్పుకోలేని పరిస్థితిలో వైసీపీ ఉందని, కులాలు, మతాల మధ్య చిచ్చు పెట్టడానికి ఆపార్టీ నేతలు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. తాము అధికారంలోకి వస్తే కొండవాలు ప్రాంతాల వారికి ఇళ్ల పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. 28వ వార్డు ఊటగడ్డ ప్రాంతంలోనూ వెలగపూడి పర్యటించారు. ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు.

అరిలోవ/మద్దిలపాలెం : వెలగపూడి రామకృష్ణబాబును నాలుగోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని ఆయన సతీమణి సుజన ఓటర్లను కోరారు. ఆమె పదో వార్డులోని ఇందిరానగర్‌లో పర్యటించారు.చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరించి,వెలగపూడిని గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మీ రాజశేఖర్, టీడీపీ వార్డు అధ్యక్షురాలు రమణి, ధనలక్ష్మి, వెలగపూడి కుటుంబ సభ్యులు పద్మజ, సీత, మాధురి, శ్రీలక్ష్మి, సబిత, సరోజ, రాధిక, సుమా, పీతల అఖిల్ పాల్గొన్నారు. అలాగే 22వ వార్డులో వెలగపూడి తనయుడు ప్రతాప్‌రుద్ర ప్రచారం చేశారు. ఇంటింటికి వెళ్లి వెలగపూడిని మరోసారి ఆశీర్వదించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొట్టా వెంకటరమణ, ఒమ్మి అప్పారావు పాల్గొన్నారు.

వైసీపీ నాయకులపై కేసు నమోదు

ఎంవీపీ కాలనీ, ఏప్రిల్ 29 : తనపై దాడి చేశారని వైసీపీ నాయకురాలు, మార్కెటింగ్ కమిటీ మాజీ డైరెక్టర్ పిళ్లా సత్యవతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎంవీపీ పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. 17వ వార్డు కార్పొరేటర్ భర్త నాగరాజు ప్రధాన అనుచరులుగా ఉన్న శాంతి, నలుగురు మహిళలు, ఎనిమిది మంది పురుషులపై కేసు నమోదు చేశారు. పార్టీ కార్యక్రమాల్లో తాను చురుగ్గా ఉండడంతో సహించలేక దాడిచేసినట్టు ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఆదర్శనగర్‌లో వేసవి శిక్షణ శిబిరం

అరిలోవ, ఏప్రిల్ 29 : పాత డెయిరీ ఫారం సమీపంలో ఉన్న ఆదర్శనగర్‌లో స్నేహాంజలి నృత్యాలయంలో వచ్చే నెల 1 నుంచి 31 వరకు వేసవి శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్టు నిర్వాహకుడు శైలజామూర్తి తెలిపారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వేసవి సెలవుల నేపథ్యంలో విద్యార్థులకు ఉచితంగా కూచిపూడి, వెస్ట్రన్ నృత్యంలో శిక్షణ ఇవ్వనున్నట్టు చెప్పారు. చివరి రోజున చిన్నారులతో ప్రదర్శన ఏర్పాటు చేసి, పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు ఇస్తామన్నారు.



13వ వార్డులో పర్యటిస్తున్న ఎంవీవీ సత్యనారాయణ, వైసీపీ నాయకులు, కార్యకర్తలు

జగన్ పాలనతో పేదల జీవితాల్లో వెలుగులు

- తూర్పు వైసీపీ అభ్యర్థి సత్యనారాయణ



అప్పుఘర్ పరిసరాల్లో ప్రచారం చేస్తున్న ఎంవీవీ

ఎంవీపీ కాలనీ, ఏప్రిల్ 29 : వైసీపీని మరోసారి గెలిపిస్తేనే పేదలకు సంక్షేమ పథకాలు అందుతాయని ఆ పార్టీ తూర్పు నియోజకవర్గం అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. సోమవారం ఆయన 18 వార్డులోని ఎంవీపీ కాలనీలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగన్ పాలనతో పేదల జీవితాల్లో వెలుగులు వచ్చాయన్నారు. వైసీపీ పాలన నచ్చడం వల్లే ప్రతిరోజూ ఇతర పార్టీల నుంచి చేరికలు జరుగుతున్నాయన్నారు. తాను గెలిస్తే అందరికీ అందుబాటులో ఉంటానని, నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ఆదర్శనీయంగా తీర్చిదిద్దుతానని తెలిపారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన వెలగపూడి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయలేదని విమర్శించారు. మరోసారి వైసీపీని గెలిపిస్తే అభివృద్ధిలో విశాఖ అంతర్జాతీయ స్థాయికి చేరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి నారాయణ, నాయకులు అనీల్, రాము, గిరి, ధనరాజు, పవన్, ఎల్లాజీ పాల్గొన్నారు.

అరిలోవ : ముఖ్యమంత్రి జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపాయని తూర్పు వైసీపీ అభ్యర్థి సత్యనారాయణ అన్నారు. 13వ వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత సత్యన్నారాయణ ఆధ్వర్యంలో ఆయన ఆరిలోవ ఆఖరి బస్టాపు, పాండురంగాపురం, వెర్ని దుర్గానగర్, దుర్గా బజారు, శివశంకర్‌నగర్, సాయినగర్, శ్రీకాంత్ నగర్, జేఎన్ఎన్ఆర్ఎం కాలనీ తదితర ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు.ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరిస్తూ.. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కెల్ల సత్యన్నారాయణ, దుర్గారావు, శిరీషా పాల్గొన్నారు.

బీజేపీలో పలువురి చేరిక

పెదవాల్తేరు, ఏప్రిల్ 29 : లాసన్స్ బే కాలనీలోని బీజేపీ కార్యాలయంలో దక్షిణ నియోజకవర్గం 29వ వార్డుకు చెందిన వైసీపీ నాయకులు పల్లా రాధాకృష్ణ, లక్ష్మి, తదితరులు పల్లా జగన్నాథరావు ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. వారికి ఆ పార్టీ విశాఖ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాధాలక్ష్మి మాట్లాడుతూ ప్రధాని మోదీ పరిపాలన పట్ల ఆకర్షితులై బీజేపీలో చేరినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయుకులు ప్రకాశ్‌రెడ్డి, ఎన్. విజయనందరెడ్డి, జె. దామోదర్ యాదవ్ పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

భీమునిపట్నం, ఏప్రిల్ 29 : భీమిలి కోర్టు బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక సోమవారం జరిగింది. అధ్యక్షుడిగా ఎంవీ పార్వతీశం, కార్యదర్శిగా కేఎస్ఎం సుధాకర్, కోశాధికారిగా ముమ్మిడిశెట్టి సునీల్, ఉపాధ్యక్షుడిగా బమ్మిడి సూర్యనారాయణ, సంయుక్త కార్యదర్శిగా బోర సూర్య ప్రకాష్‌రెడ్డి, కార్యనిర్వాహక సభ్యులుగా అప్పలరాజు, అరుణకుమారి, నర్సింగరావు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా అడ్వకేట్ ఎస్. వాయు నందన వ్యవహరించారు.

ఎలమంచిలి నియోజకవర్గంలో ఓటర్ల వివరాలు	
మొత్తం ఓటర్లు	2,04,073
పురుషులు	99,340
మహిళలు	1,04,724
ఇతరులు	9

ఓటరు మాట

ఉచితాలు కాదు...ఉపాధి కావాలి



ప్రభుత్వ అసమర్థతతో నిరుద్యోగం పెరిగిపోయింది. రాష్ట్రంలో ఆర్థిక నేరాలు, హత్యలు, దొంగతనాలు పెచ్చుమీరాయి. సర్కారు ఉచితాలంటూ ప్రజలను సోమరులుగా మార్చేసింది. ప్రతి ఇంట్లోనూ చదువుకున్న యువత ఉన్నారు. ఇంటికో ఉద్యోగం ఇస్తే వారే కుటుంబాలను పోషించుకోగలరు. మద్య నిషేదం చేస్తామని హామీ ఇచ్చి ప్రభుత్వం మాటతప్పింది. ఓటు అనే ఆయుధాన్ని ఉపయోగించి, ఇలాంటి వారికి బుద్ధిచెప్పాలి. భవిష్యత్తుకు భరోసా ఇచ్చే పార్టీనే గెలిపించాలి.

- కె.సరళ, కైలాసపురం రోడ్డు, విశాఖ

న్యాయం చేసే ప్రభుత్వం రావాలి



రాష్ట్రంలోని అన్ని వర్గాల వారికి సమన్యాయం చేసే ప్రభుత్వం కావాలి. కష్టాల్లో ఉన్నవారికి అండగా నిలిచే వ్యక్తిత్వం ఉన్న నేతలకే ఓటు వేయాలి. ప్రజావసరాలను గుర్తించి, పరిష్కరించే సత్తా, సామర్థ్యం కలిగిన నేతలను ఎన్నుకుంటేనే భవిష్యత్తుకు భరోసా.

- ఎ.విజయకుమార్, అనకాపల్లి

ఉక్కు పరిరక్షణకు హామీ ఇస్తేనే...



స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలో కొనసాగిస్తామని హామీ ఇచ్చే పార్టీకి ఓటు వేయాలి. ఉక్కు పరిశ్రమను ప్రైవేటు పరం కాకుండా కార్మికులు ఏళ్లుగా ఉద్యమాలు, ఆందోళనలు చేస్తున్నారు. ఎన్నికల సమయం వచ్చింది. పరిశ్రమను కాపాడుతామని హామీ ఇచ్చిన వారికే ఓటు వేయాలి.

- ఆర్.తిరుమలరావు, గోపాలపట్నం

ఎన్నికల వేడి మొద ▶ **మీరూ పంపించండి**

లయ్యింది. పార్టీలు, అభ్యర్థులు సమరాంగణానికి సిద్ధమవుతున్నారు. ఎటువంటి వారు అధికారంలోకి రావాలని మీరు కోరుకుంటున్నారు? పాలకులు ఎలా ఉండాలనుకుం టున్నారు?, ఏం చేయాలని కోరుకుంటున్నారు? ...అభిప్రాయం ఏదైనా మీ మనసులో మాట మాతో పంచుకోండి. దాన్ని 'ఆంధ్రజ్యోతి' పాఠకుల ముందుంచుతాం. ఇంకెందుకు ఆలస్యం మీ అభిప్రాయాన్ని, ఫోటోతో సహా ఈ నంబరుకు వాట్సాప్ చేయండి.

వాట్సాప్ నంబర్ ... 9848212243

ఎలమంచిలిలో టీడీపీకి ఆదరణ



దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత జరిగిన నియోజకవర్గాలపునర్విభజనలో ఏర్పాటైన వాటిల్లో 'ఎలమంచిలి' ఒకటి. అంతకుముందు కొంతభాగం అటు పాయకరావుపేట నియోజకవర్గంలో ఉండేది. రాంబిల్లి, మునగపాక, అచ్యుతాపురం మండలాలు కొండకర్ల నియోజకవర్గంలో ఉండేవి. ఎలమంచిలి సమితిగా ఉన్న సమయంలో 1952లో నియోజకవర్గంగా మారింది. మండల వ్యవస్థ ఏర్పాటైన తరువాత ఎలమంచిలి నియోజకవర్గంలో ఎలమంచిలి, రాంబిల్లి, అచ్యుతాపురం మండలాలతో పాటు ఎస్.రాయవరం, మునగపాక మండలాల్లోని కొన్ని గ్రామాలు ఉండేవి. 2009లో జరిగిన నియోజకవర్గాల పునర్విభజనలో మునగపాక మండలాన్ని పూర్తిగా ఎలమంచిలి నియోజకవర్గంలోకి, ఎస్.రాయవరం మండలాన్ని పాయకరావుపేట నియోజకవర్గంలో విలీనం చేశారు. ప్రస్తుతం నియోజకవర్గంలో ఎలమంచిలి, రాంబిల్లి, మునగపాక, అచ్యుతాపురం మండలాలు ఉన్నాయి. నియోజకవర్గం ఒకప్పుడు పూర్తిగా వ్యవసాయ ఆధారిత ప్రాంతం. ఆ తరువాత అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల్లో పరిశ్రమలు ఏర్పాటు ప్రారంభమయ్యాక పారిశ్రామిక కేంద్రంగా గుర్తింపు సాధించింది. అలాగే మేజరు పంచాయతీగా ఉండే ఎలమంచిలి చుట్టుపక్కల ఏడు పంచాయతీల విలీనంతో మునిసిపాలిటీగా మారింది.

నాలుగుసార్లు పప్పల చలపతిరావే విజేత

- ఇప్పటివరకూ 15సార్లు ఎన్నికలు
- ఆరుసార్లు తెలుగుదేశం, నాలుగుసార్లు కాంగ్రెస్, ఒకసారి వైసీపీ అభ్యర్థుల గెలుపు



పప్పల బాపునాయుడు



వీసం సన్యాసినాయుడు



నగిరెడ్డి సత్యనారాయణ



పప్పల చలపతిరావు



యు.వి.రమణమూర్తిరాజు



పంచకర్ల రమేష్ బాబు

టీడీపీకే ఆధిక్యం

నియోజకవర్గం ఏర్పడిన నాటి నుంచి నేటివరకూ 15సార్లు ఎన్నికలు జరిగాయి. తొలి ఆరు ఎన్నికల్లో మూడుసార్లు స్వతంత్ర అభ్యర్థులు (సి.వి.ఎస్.రాజు, నగిరెడ్డి సత్యనారాయణ, కె.కె.వి.రాజు) గెలిచారు. 1952 ఎన్నికల్లో పప్పల బాపునాయుడు కృషికార్ లోక్ పార్టీ నుంచి గెలుపొందగా, 1955లో సి.వి.ఎస్.రాజు స్వతంత్ర్య అభ్యర్థిగా విజయం సాధించారు. తరువాత 1962లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన వీసం సన్యాసినాయుడు...సీపీఐ అభ్యర్థి వెలగా వీరభద్రరావు (సీపీఐ)పై గెలుపొందారు. 1967లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన నగిరెడ్డి సత్యనారాయణ...కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన వీసం సన్యాసినాయుడుపై విజయం సాధించారు. 1972లో స్వతంత్ర అభ్యర్థి కె.కె.వి.రాజు...సన్యాసినాయుడుపై గెలుపొందారు. 1978లో వీసం సన్యాసినాయుడు(కాంగ్రెస్)...నగిరెడ్డి సత్యనారాయణపై గెలిచారు. 1983లో తెలుగుదేశం అభ్యర్థిగా పోటీ చేసిన కేకేవీఎస్ రాజు కాంగ్రెస్ అభ్యర్థి వీసం సన్యాసినాయుడుపై గెలుపొందారు. 1985, 1989లో వీసం సన్యాసినాయుడుపైన, 1994లో నగిరెడ్డి ప్రభాకర్‌రావుపైన, 1999లో ఉప్పలపాటి యువి.రమణమూర్తిరాజు (కన్నబాబు)పైన వరుసగా నాలుగుసార్లు తెలుగుదేశం పార్టీ తరపున పోటీ చేసిన పప్పల చలపతిరావు గెలుపొందారు. 2004, 2009లో రెండు సార్లు ఒకసారి టీడీపీ, మరోసారి ప్రజా రాజ్యం తరపున పోటీకి దిగిన గొంతిన నాగే శ్వరరావుపై కన్నబాబురాజు విజయం సాధించారు. అనంతరం 2014 ఎన్నికల్లో వైసీపీ పార్టీ అభ్యర్థి ప్రగడ నాగేశ్వరావుపై పంచకర్ల రమేశ్‌బాబు గెలుపొందారు. 2019లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ పార్టీ అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబుపై యువి. రమణమూర్తిరాజు గెలుపొందారు. 1983లో తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించాక చాలా ఏళ్లపాటు విపక్షాలకు నియోజకవర్గంలో చోటులేకుండా పోయింది. వరుసగా ఆ పార్టీ అభ్యర్థులు ఐదుసార్లు విజయకేతనం ఎగురవేశారు. 1983లో జరిగి ఎన్నికల్లో కె.కె.వి. రాజు గెలుపొందగా తర్వాత పప్పల చలపతిరావు వరుసగా నాలుగుసార్లు గెలిచి సంచలనం సృష్టించారు. 1989లో రాష్ట్రం అంతటా కాంగ్రెస్ గాలి వీచినా ఇక్కడి ప్రజలు టీడీపీకే పట్టం కట్టడం విశేషం. టీడీపీ జైత్రయాత్రకు 2004లో బ్రేక్‌పడింది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి యు.వి.రమణమూర్తిరాజు విజయం సాధించారు. ఆ ఎన్నికల్లో చలపతిరావును అనకాపల్లి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేయించిన టీడీపీ అధిష్ఠానం, ఆయన స్థానంలో గొంతిన నాగేశ్వరరావుకు టికెట్ ఇచ్చింది. ఎంపీగా పప్పల చలపతిరావు విజయం సాధించినా ఎలమంచిలి నియోజకవర్గంలో మాత్రం పార్టీ అభ్యర్థి గొంతిన నాగేశ్వరరావు ఓడిపోయారు. వచ్చే నెలలో జరగనున్న ఎన్నికల్లో యు.వి.రమణమూర్తి రాజు వైసీపీ అభ్యర్థిగా, సుందరపు విజయకుమార్ జనసేన అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. అభ్యర్థులు ఎంతమంది ఉన్నా వీరిద్దరి మధ్య ప్రధాన పోటీ జరగనున్నది.

● ఎలమంచిలి

ఎలమంచిలి వ్యూ

ఎలమంచిలి ఎమ్మెల్యేలు వీరే

సంవత్సరం	విజేత	పార్టీ	మెజార్టీ	ప్రత్యర్థి
1952-1955	పప్పల బాపునాయుడు	కృషికార్ లోక్‌పార్టీ	....	ఎ.సూర్యనారాయణమూర్తి (కాంగ్రెస్)
1955-1962	సి.వి.ఎస్.రాజు	ఇండిపెండెంట్	3,660	కాండ్రేగుల రామజోగి (సీపీఐ)
1962-1967	వీసం సన్యాసినాయుడు	కాంగ్రెస్	3,626	వెలగా వీరభద్రరావు (సీపీఐ)
1967-1972	నగిరెడ్డి సత్యనారాయణ	ఇండిపెండెంట్	2.355	వీసం సన్యాసినాయుడు (కాంగ్రెస్)
1972-1978	కె.కె.వి.రాజు	ఇండిపెండెంట్	6,548	వీసం సన్యాసినాయుడు (కాంగ్రెస్)
1978-1983	వీసం సన్యాసినాయుడు	కాంగ్రెస్	8,667	నగిరెడ్డి సత్యనారాయణ (జెఎన్‌పి)
1983-1985	కేకేవీఎస్ రాజు	టీడీపీ	7,828	వీసం సన్యాసినాయుడు (కాంగ్రెస్)
1985-1989	పప్పల చలపతిరావు	టీడీపీ	9,920	వీసం సన్యాసినాయుడు (కాంగ్రెస్)
1989-1994	పప్పల చలపతిరావు	టీడీపీ	12,254	వీసం సన్యాసినాయుడు (కాంగ్రెస్)
1994-1999	పప్పల చలపతిరావు	టీడీపీ	24,246	నగిరెడ్డి ప్రభాకరరావు (కాంగ్రెస్)
1999-2004	పప్పల చలపతిరావు	టీడీపీ	7,054	యూవీరమణమూర్తిరాజు (కాంగ్రెస్)
2004-2009	యు.వి.రమణమూర్తిరాజు	కాంగ్రెస్	5.863	గొంతిన నాగేశ్వరరావు (టీడీపీ)
2009-2014	యు.వి.రమణమూర్తిరాజు	కాంగ్రెస్	10,090	గొంతిన నాగేశ్వరరావు (ప్రజారాజ్యం)
2014-2019	పంచకర్ల రమేశ్‌బాబు	టీడీపీ	8,375	ప్రగడ నాగేశ్వరరావు (వైసీపీ)
2019-2024	యు.వి.రమణమూర్తిరాజు	వైసీపీ		పంచకర్ల రమేశ్‌బాబు (టీడీపీ

చట్టం... చట్రం

ప్రజాస్వామ్యంలో ఎన్నికలు చాలా కీలకం. ప్రజలు ఎన్నుకునే ప్రభుత్వానికి ఓ మార్గం. ఏ ఎన్నికలైనా ప్రజాభిప్రాయాన్ని వంద శాతం ప్రతిబింబించేలా ఉండాలి. ఇందుకు నిష్పక్షపాతంగా ఎన్నికల నిర్వహణ జరగాలి. అలా జరిగేందుకు రాజ్యాంగం ఏర్పాటుచేసిన వ్యవస్థే కేంద్ర ఎన్నికల సంఘం. దీనికి అనుబంధంగా రాష్ట్ర స్థాయి కమిషన్‌లు ఉంటాయి. దేశంలో జరిగే ఏ స్థాయి ఎన్నికలైనా ఎన్నికల సంఘం ప్రత్యక్ష, పరోక్ష అజమాయిషీలోనే జరుగుతాయి. అందువల్ల ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన మరుక్షణం వ్యవస్థలన్నీ ఎన్నికల సంఘం పరిధిలోకి వెళతాయి. ఈసీ కనుసన్నల్లోనే నడుచుకోవాల్సి ఉంటుంది. అందువల్ల కోడ్ అమలులో ఉండగా రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఎంత జాగ్రత్తగా ఉంటే వారి భవిష్యత్తుకు అంత మంచిది.

ఎన్నికల వేళ నిబంధనలు కచ్చితంగా పాటించాల్సిందే

- అతిక్రమిస్తే శిక్ష ఎదుర్కొనాల్సి రావచ్చు
- తెలిసి జరిగినా... తెలియక జరిగినా అభ్యర్థులే బాధ్యులు
- మీతోపాటు అనుచరులనూ అప్రమత్తంగా ఉంచాలి
- కోడ్ అమలులో ఉండగా కమిషన్ కనుసన్నల్లోనే అన్నీ





సార్వత్రిక ఎన్నికలు ఐదేళ్లకొకసారి నిర్వహించాలని రాజ్యాంగం నిర్దేశించింది. అనివార్య కారణాలు, ప్రభుత్వాల అనిశ్చితి, పాలకుల నిర్ణయాల వల్ల కొంచెం అటూఇటుగా జరగొచ్చు. ఎప్పుడు నిర్వహించినా ఎన్నికల నిర్వహణ మహాక్రతువు. అధికారం దక్కించుకునేందుకు రాజకీయ పక్షాలు ఎంతగా కష్టపడాలో, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం అంతకు రెట్టింపు కష్టపడాలి. ఈ క్రమంలో ఎవరు ఎన్నికల నియమావళిని అతిక్రమించినా చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తారు. ఆ తర్వాత చర్యలు తప్పవు. అందువల్ల ఎన్నికల ప్రచారం సందర్భంలో రాజకీయ పార్టీలు, నాయకులు, అభ్యర్థులు, కార్యకర్తలు...ఎవరైనా ఎన్నికల నియమావళిని అతిక్రమిస్తే ఇబ్బందుల్లో పడినట్టే. సాధారణ పౌరులు, ఓటర్లు, ఎవరు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసినా కమిషన్ తక్షణం విచారణకు ఆదేశిస్తుంది. ఉమ్మడి జిల్లాలోని మూడు లోక్‌సభ, 15 అసెంబ్లీ నియోజకవర్గాలకు వచ్చేనెల 13న ఎన్నికలు జరగనున్నాయి. నామినేషన్ల ఘట్టం కూడా సోమవారం పూర్తయ్యింది. ఇక ఎన్నికలు జరగడమే తరువాయి. అయితే అభ్యర్థులు, పార్టీలకు గెలుపు ఎంతముఖ్యమో ఎన్నికల నియమావళికి లోబడిపనిచేయడం అంతే ముఖ్యం. ప్రస్తుతం ఎన్నికల నియమావళి అమలులో ఉంది. అంటే రాజకీయ పక్షాలు, ప్రతినిధులు చట్టం చట్రంలో ఉన్నట్టే. ఈ నేపథ్యంలో ఎన్నికల చట్టాలు, నియమ నిబంధనలపై 'ఆంధ్రజ్యోతి' అందిస్తున్న ప్రత్యేక కథనం ఇది.

కులమతాలను రెచ్చగొడితే....

ఎన్నికల ప్రచారంలో భాగంగా రాజకీయ పార్టీలు, నాయకులు, అభ్యర్థులు తమ ప్రసంగాల్లో కుల, మతాలను రెచ్చగొట్టేవిధంగా మాట్లాడకూడదు. ఎవరైనా ఆ విధంగా చేసినట్లయితే ఎన్నికల చట్టంలోని సెక్షన్ 123 ప్రకారం సాధారణ పౌరులు కూడా ఫిర్యాదు చేయొచ్చు.

వర్గ విభేదాలు సృష్టిస్తే జైలే...

ఎన్నికల సందర్భంగా ఎవరైనా వర్గ విభేధాలు సృష్టించే ప్రయత్నం చేస్తే సెక్షన్ 125 ప్రకారం మూడేళ్లపాటు జైలుశిక్ష, జరిమానా ఉంటుంది. కొన్ని సందర్భాల్లో రెండూ విధించే అధికారం కోర్టుకు ఉంటుంది.

48 గంటల ముందే ప్రచారానికి తెర...

ఎన్నికల నియమావళి ప్రకారం పోలింగ్‌కు 48 గంటల ముందు ప్రచారం నిలిపివేయాలి. ఒక వేళ ఏ పార్టీకి సంబంధించిన నాయకులు, అభ్యర్థులైనా ఆ తర్వాత సభలు, సమావేశాలు నిర్వహించినట్టు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు అందితే సెక్షన్ 126 ప్రకారం శిక్ష తప్పదు. ఫిర్యాదు దారుడు అందించిన సాక్ష్యాధారాల ప్రకారం రెండేళ్ల జైలు శిక్ష లేదా జరిమానా విధిస్తారు.

అల్లర్లు సృష్టిస్తే ఆరు నెలల జైలు

ఎన్నికల సభలు, సమావేశాలు, ప్రచారం సందర్భంలో అల్లర్లు సృష్టించినట్టు రుజువైతే పోలీసులు బాధ్యులైన మూకలను చట్టంలోని 127 సెక్షన్ ప్రకారం అరెస్టు చేయవచ్చు. రుజువైతే కనీసం ఆరు నెలలు జైలు శిక్ష, రూ.2వేల వరకు జరిమానా తప్పదు.

పోలింగ్ సిబ్బందికి చిక్కులే

చట్టంలోని 129 సెక్షన్ ప్రకారం ఎన్నికల అధికారులు, సిబ్బంది, పోలీసులు ఏ పార్టీకి చెందిన అభ్యర్థికైనా బహిరంగంగా, లోపాయికారీగా సహకరిస్తే చిక్కుల్లో పడతారు. అలా చేసినట్టు ఉద్యోగులపై ఫిర్యాదులు అందితే, కమిషన్ విచారణ జరుపుతుంది. నేరం రుజువైతే ఉద్యోగులకు కనీసం మూడు నెలల జైలుశిక్ష విధించే అవకాశం ఉంది. ప్రభుత్వ శాఖల ఉద్యోగులు పోలింగ్ ఏజెంట్లుగా, ఓట్ల లెక్కింపు ఏజెంట్లుగా పార్టీల తరుపున వెళితే అటువంటి వారిపై ఫిర్యాదులు అందితే కమిషన్ సెక్షన్ 134ఎ ప్రకారం చర్యలు చేపట్టనున్నది. నేరం రుజువైతే కనీసం మూడు నెలలు జైలు శిక్ష, జరిమానా విధిస్తారు.

ఈవీఎంలు అపహరిస్తే ఏడాది జైలు

పోలింగ్ కేంద్రాల నుంచి అల్లరి మూకలు ఈవీఎంలు అపహరిస్తే అటువంటి వారిపై పోలీసులు చట్టంలోని 135వ సెక్షన్ ప్రకారం కేసులు నమోదు చేస్తారు. దుండగులకు ఏడాది జైలు శిక్ష, రూ500 జరిమానా విధించే అవకాశం ఉంది.

మారణాయుధాలతో తిరిగితే...

ఎన్నికల సందర్భంగా ఎవరైనా మారణాయుధాలతో తిరగడం నేరం. సంబంధిత పోలీసులు మారణాయుధాలతో పట్టుబడిన వ్యక్తులకు రెండు నెలల జైలుశిక్ష, జరిమానా విధించే అవకాశం ఉంది.

మీ ఓటు మరొకరు వేస్తే...

పోలింగ్ కేంద్రానికి వెళ్లేసరికే మీ ఓటు ఎవరైనా వేసేస్తే పోలింగ్ అధికారికి ఫిర్యాదు చేయవచ్చు. మీ ఓటుకు సంబంధించి సరైన ఆధారాలు చూపిస్తే, ఓటు దుర్వినియోగం అయినట్టు తేలితే పోలింగ్ అధికారి మీకు ఓటు వేసే అవకాశం కల్పిస్తారు. దీన్నే ఛాలెంజింగ్ ఓటు అంటారు. దీన్ని బ్యాలెట్ బాక్స్‌లో కాకుండా ప్రత్యేకంగా భద్రపరుస్తారు.

బహిరంగంగా ఓటేసినా ఇబ్బందే

ఎన్నికల నిబంధనావళి ప్రకారం ఓటు వేసే ప్రక్రియ రహస్యంగా సాగాలి. ఓటర్లు ఎవరైనా బహిరంగంగా ఓటు వేస్తే ఆ ఓటరుకు చట్టం ప్రకారం మూడు నెలల జైలు, జరిమానా విధిస్తారు. ఓటేసే వారు నియమ నిబంధనలు పాటించకపోతే ఇబ్బందులు తప్పవు.

పోలింగ్ కేంద్రాల వద్ద ప్రచారం నిషేధం

పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్లలోపు ఎన్నికల ప్రచారాన్ని కమిషన్ నిషేధించింది. ఒకవేళ ఎవరైనా నిబంధనలు అతిక్రమించి పోలింగ్ కేంద్రం పరిధిలో ప్రచారం చేస్తే ఆయా రాజకీయ పార్టీలు, అభ్యర్థులు బాధ్యత వహించాల్సి వస్తుంది. పోలింగ్ కేంద్రానికి సమీపంలో ప్రచార సామగ్రిని స్వాధీనం చేసుకునే అధికారం కమిషన్ కల్పించింది.

● విశాఖపట్నం

భలే రికార్డు

పెందుర్తి ఎమ్మెల్యేలైన తండ్రీ తనయులు

- 1978లో గుడివాడ అప్పన్న, 1989లో గుడివాడ గురునాథరావు విజయం
- 1983లో పెతకంశెట్టి అప్పలనరసింహం, 1996లో గణబాబు గెలుపు
- పెతకంశెట్టి, గణబాబుపై పోటీచేసిన ద్రోణంరాజు సత్యనారాయణ, శ్రీనివాస్ తండ్రీ తనయులే!



గుడివాడ అప్పన్న



గుడివాడ గురునాథరావు



పెతకంశెట్టి అప్పలనరసింహం



పెతకంశెట్టి గణబాబు

ఉమ్మడి రాష్ట్రంలో రెండో అతిపెద్ద నియోజకవర్గంగా నిలిచిన పెందుర్తి మరో ఘనతను కూడా సాధించింది. ఇక్కడి నుంచి పోటీలో నిలిచిన తండ్రీ తనయులు ఎమ్మెల్యేలుగా ఎన్నికై చరిత్ర పుటల్లో స్థానం సంపాదించుకుంది. ఇలా ఒకసారి కాదు... రెండు సార్లు తండ్రీ కుమారులు పదవులను అలంకరించారు. ఆ వివరాలివి... 1978లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో పెందుర్తి నియోజవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసిన గుడివాడ అప్పన్న సీపీఎం అభ్యర్థి గంగాధరరెడ్డిపై విజయం సాధించి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆ తరువాత గుడివాడ అప్పన్న కుమారుడు గుడివాడ గురునాథరావు 1989లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగానే పోటీచేసి టీడీపీ అభ్యర్థి పల్లా సింహాచలంపై గెలుపొందారు. ఇలా 1978, 1989లో తండ్రీ కుమారులు ఇద్దరూ ఎమ్మెల్యేలుగా ఎన్నికైన ఘనతను సాధించారు.

అలాగే పెతకంశెట్టి అప్పల నరసింహం, ఆయన కుమారుడు గణబాబు ఇదే నియోజకవర్గం నుంచి శాసనసభ్యులుగా ఎన్నికయ్యారు. 1983లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీచేసిన పెతకంశెట్టి అప్పలనరసింహం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీచేసిన ద్రోణంరాజు సత్యనారాయణపై విజయం సాధించి శాసనసభలో అడుగుపెట్టారు. అదేవిధంగా పెతకంశెట్టి కమారుడు పీవీజీఆర్ నాయుడు (గణబాబు) 1996లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో ఇదే నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా రంగంలోకి దిగి కాంగ్రెస్ అభ్యర్థి ద్రోణంరాజు శ్రీనివాస్‌పై గెలుపొందారు. ఇలా 1983, 96లో తండ్రీ కుమారులు ఎమ్మెల్యేలు అయ్యారు. ఇందులో మరో గమ్మత్తైన విషయం ఏమిటంటే ఎమ్మెల్యేలుగా ఎన్నికైన తండ్రీ తనయులు పెతకంశెట్టి అప్పలనరసింహం, గణబాబు పోటీచేసిన సందర్భంలో వారి ప్రత్యర్థులు ద్రోణంరాజు సత్యనారాయణ, ద్రోణంరాజు శ్రీనివాస్ కూడా తండ్రీ తనయులే కావడం.

అక్కడ తండ్రులు... ఇక్కడ కుమారులు

ఇక ఈ సార్వత్రిక ఎన్నికల్లో మరో విశేషం చోటుచేసుకుంది. పెందుర్తిలో పరస్పరం పోటీ పడిన వారి కుమారులు ప్రస్తుతం గాజువాకలో ఎన్నికల బరిలో నిలిచారు. ఈ నియోజకవర్గం నుంచి వైసీపీ, టీడీపీ అభ్యర్థులుగా తలపడుతున్న గుడివాడ అమర్‌నాథ్, పల్లా శ్రీనివాసరావు తండ్రులు గతంలో పెందుర్తి నియోజవర్గం నుంచి పోటీచేశారు. ఇప్పటి గాజువాక అప్పట్లో పెందుర్తి పరిధిలో ఉండేది. ఈక్రమంలో 1989లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పెందుర్తి నుంచి గుడివాడ గురునాథరావు, పల్లా సింహాచలం పోటీ చేశారు. గుడివాడ విజయం సాధించారు. యాదృచ్ఛికంగా ఇప్పుడు జరుగుతున్న ఎన్నికల్లో గాజువాక నియోజకవర్గం నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న గుడివాడ అమర్‌నాథ్ గురునాథరావు కుమారుడు. ఇక టీడీపీ అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు తండ్రి సింహాచలం. ఇలా గతంలో పెందుర్తిలో తలపడిన తండ్రుల స్థానంలో వారి తనయులే గాజువాక నుంచి పోటీ పడుతుండడం ప్రత్యేకత సంతరించుకుంది.

● పెందుర్తి

మీకు తెలుసా!

వీవీపీఏటీ (వీవీప్యాట్) అంటే ...



ఎన్నికల సంస్కరణల్లో భాగంగా భారత ఎన్నికల సంఘం ప్రవేశపెట్టిన పరికరాలలో వీవీపీఏటీ (వీవీప్యాట్) ఒకటి. దీనిని ఓటర్ వెరిఫైయబుల్ పేపర్ ఆడిట్ ట్రైల్ అంటారు. ఇది ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్‌కు అనుసంధానమయ్యే పేపర్ రికార్డు. ప్రింటర్ పోర్ట్ ద్వారా ఈవీఎంతో కనెక్ట్ చేస్తారు. ఓటు రికార్డింగ్‌ను ధ్రువీకరించడానికి పేపర్ స్లిప్‌లో ఓటు డేటా, కౌంటర్లను రికార్డు చేస్తుంది. ఎన్నికల్లో మోసాలు, రిగ్గింగ్‌ను తొలగించడంలో సహాయపడుతుందని ఈసీ ప్రకటించింది.

డిపాజిట్ కోల్పోవడం అంటే..

ఎన్నికల సమయంలో కొంతమంది అభ్యర్థులు డిపాజిట్ కోల్పోయారని వింటుంటాం. అంటే.. ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థికి పోలై, చెల్లిన ఓట్లలో 1/6వ వంతు రావాల్సి ఉంటుంది. లేదంటే పోటీ చేసేందుకు చెల్లించిన డిపాజిట్ సొమ్మును కోల్పోయినట్టు.